జనరాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 4 సంచిక - 16 పక్షపత్రిక సెప్టెంబర్ 1-15, 2013




## రైతుల ఊసు లేని ఆహారభద్రత

## ఓట్ల వేటకు పథకం - అభివృద్ధికి ప్రతిబంధకం



నిజామాబాద్ జిల్లా వర్ని మండలం చింతకుంట గ్రామ రైతులతో మాట్లాడుతున్న డా॥ జయప్రకాష్ నారాయణ్











డా॥ జయప్రకాష్ నారాయణ్ నిజామాబాద్ పర్యటన దృశ్యాలు

జన రాజకీయం కోసం...
లోక్‌సత్తా టైమ్స్
పక్షపత్రిక సెప్టెంబర్ 1-15, 2013
సంపుటి - 4 సంచిక - 16

## లోపలి పేజీల్లో...

జాతీయ ఆహార భద్రత బిల్లు - 2013 ..... 5
ఆహార భద్రత చట్టం అనాలోచితం........... 8
ఆహార భద్రత రాష్ట్రానికి భారమే................ 10
లైసెన్స్ - పర్మిట్ వ్యవస్థ అవశేషం ఆహార భద్రతా బిల్లు : జేపీ.......... 11
రైతుకి, పరిశ్రమకీ ఉపయోగపడని భూసేకరణ బిల్లు : జేపీ............................ 15
జీడీపీ తరుక్కుపోతోంది......................... 17
విధానాల్ని, రాజకీయాల్ని మార్చుకుంటేనే తెలుగువారి సంక్షోభానికి శాశ్వత పరిష్కారం..... 18
మహిళలకు అంతటా అన్యాయం............. 24
ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలి.......... 25
కళాశాలల్లో సురాజ్య శంఖారావం............26
జిల్లాలలో కార్యక్రమాలు.......................... 27

కవర్‌పేజీ : ఫేకింగ్ న్యూస్.కామ్ సౌజన్యంతో....

సంపాదకవర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

డి.వి.వి.యస్. వర్మ
సంపాదకులు

సంపాదక వర్గం
పి. రవిమారుత్
బండారు రామ్మోహన్‌రావు
ఓంకార్
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి
ఫోటోలు : ఎన్. సంజీవ్ కుమార్

# రైతుల ఊసు లేని ఆహార పథకం

## సంపాదకీయం

ఎన్నికలు దగ్గర పడ్డప్పుడల్లా పార్టీలకు ప్రజలు గుర్తుకు వస్తారు. కాదు...కాదు నిజం చెప్పాలంటే ఓట్లు గుర్తుకొస్తాయి. 'అత్త సొమ్ము అల్లుడు దానం' చేసినట్టు ప్రభుత్వ సొమ్మును ఓట్ల కోసం దానం చేసే పథకాలు పుట్టుకొస్తాయి.

2009 ఎన్నికలలో కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి జాతీయ ఉపాధి పథకాన్ని 40,000 కోట్ల రూపాయలతో రూపొందించి ఎన్నికల్లో లబ్ధిపొందింది. ఇప్పుడు 2014 ఎన్నికలలో గెలవడానికి జాతీయ ఆహారపథకాన్ని 1,20,000 కోట్ల రూపాయలతో రూపొందించి 75 శాతం ప్రజలకు నేరుగా అందించే ఏర్పాటుతో మళ్లీ గద్దెనెక్కాలని ఈ పథకాన్ని తెచ్చింది.

ఈ రెండు పథకాలలోనూ రైతులు, వ్యవసాయం విస్మరణకు గురయ్యాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దాదాపుగా వ్యవసాయం చుట్టూ వుంది. కాని జాతీయ ఉపాధి పథకాన్ని మాత్రం వ్యవసాయానికి అనుసంధానం చెయ్యలేదు. వ్యవసాయేతర ఉపాధి ఎంత నిలకడగా వుంది అన్న అంశాలు పరిశీలిస్తే ఈ పథకం అభివృద్ధి పథకం కాదని ఓట్ల పథకం అని స్పష్టం అవుతుంది. ఇప్పుడు ఆహార భద్రతా పథకం. దేశానికి ఆహార భద్రత అవసరం. అది నిలకడగా, నిరంతర అభివృద్ధితో వుండాలి. రైతులు, వ్యవసాయం లేకుండా ఆహారభద్రత కల్పిస్తామనడం హాస్యాస్పదం. రైతులకు భద్రత నివ్వకుండా అసాధ్యం అని తెలిసికూడా చేస్తున్న దగా.

దేశానికి ఆహార భద్రత అవసరం. ప్రజలకు ఆహార భద్రత వుండాలి. అందులో సమాజం మీద ఆధారపడిన వికలాంగులు, వితంతువులు, వృద్ధులు. అభాగ్యులకు ఆహారాన్ని ఉచితంగా అందించడాన్ని ఎవరూ కాదనరు. అలాగే అరకొర సంపాదనతో వున్న వారికి కొంత ఆహార సబ్సీడీని అందించడాన్ని ఎవరూ తప్పపట్టరు. కాని 75% ప్రజలకి ప్రజల సొమ్ము సబ్సీడీగా ధారాదత్తం చెయ్యడం ఓట్ల వేట తప్ప మరొకటి కాదు.

ఆహారభద్రతలో రైతులది కీలక పాత్ర. కాని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకి ఓట్ల యావ తప్ప వ్యవసాయం మీద ధ్యాస లేదు. ఆహార భద్రత పేరుతో మొత్తం ఆహారధాన్యాల వ్యాపారంలో 50 శాతం ప్రభుత్వం ఆక్రమించింది. తానే కొనుగోలుదారు, నిల్వదారు, అమ్మకందారు అయింది. ఆహారధాన్యాలకు మార్కెట్ లేకుండా చేసింది. నీటి వసతి వుండి, రెండు పంటలు పండించే గోదావరి జిల్లాల రైతులు "పంట శెలవు" ప్రకటించడం దీనికి అద్దం పడుతున్నది. వ్యవసాయం పట్ల, ఆహార భద్రత పట్ల ప్రభుత్వం విధానాలు మారాలి.

దేశంలో, విదేశాల ఎగుమతుల్లో ఆంక్షలను పూర్తిగా తొలగించాలి. ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛ రైతుల హక్కు కావాలి. పేదలకు ఆహార భద్రత పద్ధతిని పూర్తిగా మార్చాలి. ఆహారధాన్యాలు అందించే పద్ధతికి బదులు షరతులతో కూడిన నగదు బదిలీ పద్ధతికి మార్చాలి. అప్పుడే ఆహారధాన్యాలకు మార్కెట్‌కు స్వేచ్ఛ లభిస్తుంది.

రైతుల్ని విస్మరించి, వ్యవసాయాన్ని సంక్షోభంలో ముంచి కేవలం ఓట్ల కోసమే పథకాలు రూపొందిస్తే, రైతులకు ఓట్లు వున్నాయని వారు తిరుగుబాటు ప్రకటిస్తారు. ■




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**

*8-2-674బి/2/9, ప్లాట్ నం : 93*
*హ్యాపీ వ్యాలి, రోడ్ నం.13ఎ,*
*బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034*

***ఫోన్ నంబర్లు :***
***040- 23311817, 23311819,***
***23311820, 23312829***
***ఫ్యాక్స్ : 040-23310612***

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311817**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# జాతీయ ఆహార భద్రత బిల్లు - 2013

**(2013 ఆగస్టు 26న లోక్‌సభలో అధికార, విపక్షాల మూజువాణి ఓటుతో ఆమోదించిన బిల్లులోని కొన్ని ముఖ్యాంశాలు)**

ఈ బిల్లు చట్టం అయితే దేశానికంతటికీ వర్తిస్తుంది. కేంద్ర ప్రభుత్వ గెజిట్ నోటిఫికేష్‌లో వివిధ రాష్ట్రాలకు ఇచ్చే వివిధ తేదీల నుండి ఆయా రాష్ట్రాలలో అమలు ప్రారంభం అవుతుంది.

**1. ప్రజలకు ఆహార భద్రత :**

ఈ చట్టం ద్వారా గుర్తించబడిన ప్రాధాన్యత కుటుంబాలలో ప్రతి వ్యక్తికి ప్రతి నెలా 5 కిలోల ఆహారధాన్యాలు (బియ్యం, గోధుమలు, తృణధాన్యాలు) అందించబడతాయి.

అంత్యోదయ పథకం ద్వారా గుర్తించబడిన కుటుంబాలకు నెలకు 35 కిలోల ఆహారధాన్యాలు అందించబడతాయి.

ప్రస్తుతం ఒక కిలో బియ్యం గరిష్టంగా 3 రూపాయలు, గోధుమలు 2 రూ॥లు, తృణధాన్యాలు 1 రూపాయికి అందిస్తారు. మూడు సంవత్సరాల తర్వాత ఈ ధరలను సవరించడం జరుగుతుంది.

దేశంలో మొత్తం మీద గ్రామీణ ప్రాంతాలలో 75 శాతం ప్రజలకు పట్టణ ప్రాంతంలో 50 శాతం ప్రజలకు దీనిని విస్తరించడం జరుగుతుంది.

**2. పిల్లలకు ప్రత్యేక ఏర్పాటు :**

6 నెలల పిల్లల నుండి 3 సంవత్సరాల పిల్లల వరకు అంగన్‌వాడీల ద్వారా ఇంటికి ఇచ్చే రేషన్ ఏర్పాటు.

3 సంవత్సరాల నుండి 6 సంవత్సరాల పిల్లలకు అంగన్ వాడీలలో వండి పెట్టే ఏర్పాటు.

ప్రాథమిక, హైస్కూల్ పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం పోషకాహారలోపం వున్నట్లు గుర్తించిన పిల్లలకు ఇంటికి ప్రత్యేక రేషన్ ఇచ్చే ఏర్పాటు.

**3. గర్భిణీ స్త్రీలకు - బాలింతలకు :**

గర్భిణీ కాలలలోనూ, ప్రసవనంతరం 6 నెలల వరకు తల్లులకు ఇంటికి ప్రత్యేక రేషన్ ఇచ్చే ఏర్పాటు. ఇవన్నీ పోషకాహారానికి ఉద్దేశించబడినవి. దీనితో పాటు గర్భిణీ స్త్రీలకు విడతల వారీగా 6000 రూపాయలు అందించబడుతుంది.

**4. అర్హత గల కుటుంబాల గుర్తింపు :**

అర్హత గల కుటుంబాల గుర్తింపుకు నిర్దిష్ట మార్గదర్శకాలను ఈ బిల్లులో పొందుపరచలేదు. అయితే జనాభా లెక్కల ఆధారంగా ఆయా రాష్ట్రాలలో ఈ పథకం గ్రామీణ ప్రాంతంలో ఎంతమందికి వర్తించేది, పట్టణ ప్రాంతంలో ఎంత మందికి వర్తించేది కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి ఆయా రాష్ట్రాలకు తెలియజేస్తుంది. దాని ఆధారంగా ఆయా రాష్ట్రాలు ప్రాధాన్యత కుటుంబాలను గుర్తించాల్సి వుంటుంది. ముందుగా అంత్యోదయ కుటుంబాలను గుర్తించిన తర్వాత మిగిలిన సంఖ్యకు ప్రాధాన్యత కుటుంబాలుగా గుర్తించాలి. ఇలా గుర్తించిన ప్రాధాన్యత కుటుంబాల జాబితాను ప్రజలకు అందుబాటులో వుండే విధంగా ప్రకటించాలి.

**5. ఆహార కమీషన్లు :**

ప్రతి రాష్ట్రంలో ఆహార కమీషన్‌ను ఏర్పాటు చెయ్యాలి. ఇందులో ఛైర్ పర్సన్, 5 మంది సభ్యులు, ఒక మెంబర్ సెక్రటరీ వుంటారు. ఇందులో తప్పనిసరిగా ఇద్దరు మహిళా సభ్యులు, యస్.సి., యస్.టి.ల నుండి ఒక్కొక్కరు సభ్యులుగా వుండాలి.

ఈ కమీషన్ రాష్ట్రంలో ఆహారభద్రతా చట్టం అమలును పర్యవేక్షిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలకు సలహాలను ఇస్తుంది. చట్ట ఉల్లంఘన జరిగిందని భావించినప్పుడు తనంతట తానుగా లేదా ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపడుతుంది. ఈ కమీషన్‌కు సివిల్ కోర్టులకున్న అధికారాలుంటాయి.

అలాగే జిల్లా స్థాయిలో వుండే ఫిర్యాదుల పరిష్కార అధికారి తీసుకున్న నిర్ణయాలపై అప్పీలును స్వీకరిస్తాయి.

**6. ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం :**

లబ్ధిదారుల నుండి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి ఈ చట్టంలో రాష్ట్ర స్థాయిలో ఆహార కమీషన్, జిల్లా స్థాయిలో జిల్లా ఫిర్యాదుల పరిష్కార అధికారి గల యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరిగా ఒక అంతర్గత యంత్రాంగాన్ని – కాల్ సెంటర్లు, హెల్ప్‌లైన్లు, నోడల్ అధికారులు తదితర రూపాలలో ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని ఏర్పాటు చెయ్యాలి.

**7. పారదర్శకతకు తగిన ఏర్పాట్లు :**

ఈ చట్టం ప్రకారం పారదర్శకమైన పద్ధతుల్ని విధిగా పాటించాలి.

1. ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన అన్ని రికార్డులను బహిరంగంగా వుంచాలి. ప్రజలు వాటిని తనిఖీ చెయ్యడానికి వీలుండాలి.
2. నిర్దిష్ట గడువులోగా సామాజిక తనిఖీలు జరిపించాలి.
3. అన్ని స్థాయిలలోనూ జరిగే లావాదేవీలన్నింటినీ ఈ చివరి నుండి ఆ చివరి వరకు కంప్యూటరీకరించి రికార్డులను పారదర్శకంగా వుంచాలి.
4. రాష్ట్ర స్థాయి నుండి రేషన్ షాపు వరకు అన్ని చోట్ల ప్రజానిఘా కమిటీలను ఏర్పాటు చేసి ఈ చట్టం అమలును, దీని పరిధిలోకి వచ్చే పథకాల అమలుపై పర్యవేక్షణకు ఏర్పాట్లు చెయ్యాలి.

**8. జిల్లాస్థాయి ఫిర్యాదుల పరిష్కార అధికారి :**

రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అధికారులను నియమిస్తాయి. ఆ జిల్లా పరిధిలో వచ్చే ఫిర్యాదులను స్వీకరించి, విచారణ చేసి నియమానుసారంగా తగిన చర్యలు తీసుకుంటారు. దీనితో సంతృప్తి చెందని పక్షంలో ఈ నిర్ణయంపై రాష్ట్ర ఆహార కమీషన్‌కు అప్పీలు చేసుకోవచ్చును.

**9. జరిమానాలు - పరిహారాలు :**

రాష్ట్ర ఆహార కమీషన్‌కు జరిమానాలు విధించే అధికారం వుంది. జిల్లా స్థాయి అధికారి ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయని వారిపై 5000 రూపాయల వరకు జరిమానా విధించవచ్చును.

అలాగే తనకు అందాల్సిన రేషన్ అందలేదని అర్హులైన లబ్ధిదారులు ఫిర్యాదు చేసినప్పుడు అతనికి ఆహార భద్రతా అలవెన్సును అందించాల్సిందిగా ఆదేశించే అధికారం కమీషన్‌కు వుంది.

**10. ప్రజా పంపిణీ వ్యవస్థలో సంస్కరణలు :**

ప్రజా పంపిణీ వ్యవస్థలో సంస్కరణలను క్రమానుగతంగా తేవాలని ఈ చట్టం నిర్దేశిస్తున్నది.

ఆహారధాన్యాలను ఇంటికి అందేలా ఏర్పాటు, అన్ని స్థాయిలలో కంప్యూటరీకరన పూర్తి చెయ్యడం, గుర్తింపు కోసం ఆధార్ కార్డు వినియోగం, పారదర్శకత, సామాజిక తనిఖీలకు

## ఆహార భద్రతాచట్టం వివిధ రాష్ట్రాలకు వర్తించే జనాభా శాతం

| Sl.No. | State/UT | Estimated state-wise percentage coverage (%) (Based on 2011-12 NSSO data) Rural | Urban |
|---|---|---|---|
| 1 | ANDHRA PRADESH | 60.96 | 41.14 |
| 2 | ARUNACHAL PRADESH | 66.31 | 51.55 |
| 3 | ASSAM | 84.17 | 60.35 |
| 4 | BIHAR | 85.12 | 74.53 |
| 5 | CHHATTISGARH | 84.25 | 59.98 |
| 6 | NCT OF DELHI | 37.69 | 43.59 |
| 7 | GOA | 42.24 | 33.02 |
| 8 | GUJARAT | 74.64 | 48.25 |
| 9 | HARYANA | 54.61 | 41.05 |
| 10 | HIMACHAL PRADESH | 56.23 | 30.99 |
| 11 | JAMMU & KASHMIR | 63.55 | 47.10 |
| 12 | JHARKHAND | 86.48 | 60.20 |
| 13 | KARNATAKA | 76.04 | 49.36 |
| 14 | KERALA | 52.63 | 39.50 |
| 15 | MADHYA PRADESH | 80.10 | 62.61 |
| 16 | MAHARASHTRA | 76.32 | 45.34 |
| 17 | MANIPUR | 88.56 | 85.75 |
| 18 | MEGHALAYA | 77.79 | 50.87 |
| 19 | MIZORAM | 81.88 | 48.60 |
| 20 | NAGALAND | 79.83 | 61.98 |
| 21 | ODISHA | 82.17 | 55.77 |
| 22 | PUNJAB | 54.79 | 44.83 |
| 23 | RAJASTHAN | 69.09 | 53.00 |
| 24 | SIKKIM | 75.74 | 40.36 |
| 25 | TAMIL NADU | 62.55 | 37.79 |
| 26 | TRIPURA | 74.75 | 49.54 |
| 27 | UTTAR PRADESH | 79.56 | 64.43 |
| 28 | UTTARAKHAND | 65.26 | 52.05 |
| 29 | WEST BENGAL | 74.47 | 47.55 |
| 30 | A & N ISLANDS | 24.94 | 1.70 |
| 31 | CHANDIGARH | 38.54 | 47.26 |
| 32 | DADRA & NAGAR HAVELI | 84.19 | 51.54 |
| 33 | DAMAN & DIU | 26.66 | 56.47 |
| 34 | LAKSHADWEEP | 35.30 | 33.56 |
| 35 | PUDUCHERRY | 59.68 | 46.94 |
| | **ALL INDIA** | **75.00** | **50.00** |

తగిన ఏర్పాట్లు, చౌక దుకాణాలను మహిళలు లేదా వారి బృందాలు నిర్వహించుకునే ఏర్పాటు, అలాగే ఆహార ధాన్యాల పంపిణీకి బదులు నగదు బదిలీ, ఆహార కూపన్లు వంటి పథకాల అమలు వంటి సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం రూపొందించే పద్ధతులను అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

**11. కేంద్ర-రాష్ట్ర-స్థానిక ప్రభుత్వాల బాధ్యత :**

ఈ చట్టం అమలులో ఆహారధాన్యాలను అందించే సాధ్యం కాని సందర్భాలలో ఆహార భద్రతా అలవెన్సును నగదు రూపంలో అందించే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది.

ఇక రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఆహారధాన్యాలను లబ్ధిదారులకు అందించడం, దీనితోపాటు అమలు చెయ్యాల్సిన పథకాలను మార్గదర్శకాలకు అనుగుణంగా అమలు చేయడం వాటి బాధ్యతలుగా ఉంటాయి.

ఈ చట్టంలో కల్పించే వాటికన్నా అదనంగా రాష్ట్ర ప్రభుత్వాలు తమ స్వంత నిధుల నుండి సమకూర్చు కోవచ్చును. అలాగే పంచాయితీలు, మున్సిపాలిటీలు తమ పరిధిలో ఈ చట్టం అమలుకు బాధ్యత తీసుకోవాలి.

**12. షెడ్యూళ్లు :**

ఈ చట్టానికి మూడు షెడ్యూళ్లు వున్నాయి. వీటిని కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ల ద్వారా సవరించవచ్చును.

మొదటి షెడ్యూలులో బియ్యం, గోధుమలు, తృణధాన్యాల విడుదల ధరలున్నాయి.

రెండవ షెడ్యూలులో పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు అందించే ఆహారం పరిమాణం అందులో ప్రొటీనుల వివరాలు వున్నాయి.

మూడవ షెడ్యూలులో ఆహార భద్రతను మరింత విస్తృత పరచడానికి, కొనసాగించడానికి తీసుకోవలసిన చర్యలను ప్రస్తావించింది.

1. వ్యవసాయ రంగాన్ని పునరుజ్జీవింప చెయ్యడం, భూ సంస్కరణలు, పరిశోధనలు, గిట్టుబాటు ధరలు.
2. ఆహారధాన్యాల సేకరణ, నిల్వ చెయ్యడం, వికేంద్రీకరణ వగైరాలు.
3. మంచినీరు, పారిశుద్ధ్యం, వైద్యసేవలు, వయోవృద్ధులకు తగిన పెన్షన్, వికలాంగులు, విడిగా జీవించే మహిళలకు పెన్షన్లు వగైరాలు. ■

## ఆహార భద్రతాబిల్లు అమలుకు అయ్యే ఖర్చు

(ఈ అంచనా మొదటి బిల్లులో ప్రతి మనిషికి 7 కిలోల చొప్పున ఇచ్చేదాని ఆధారంగా లెక్కించబడింది. ప్రస్తుత బిల్లులో దీన్ని 5 కిలోలకు కుదించారు.)

| | All figures in Rs crores | Year 1 | Year 2 | Year 3 | Total |
|---|---|---|---|---|---|
| | **Economic Cost (EC)** | | | | |
| | Rice | 98658 | 108524 | 119376 | |
| | Wheat | 56154 | 61769 | 67946 | |
| A | **Total EC – Grain** | **154812** | **170293** | **187323** | **512428** |
| | Sale of grain | | | | |
| | Rice - Priority @ Rs 3 per kg | 7127 | 7127 | 7127 | |
| | Rice - General @ 50% of MSP | 6408 | 6311 | 6942 | |
| | Wheat – Priority @ Rs 2 per kg | 3441 | 3441 | 3441 | |
| | Wheat – General @ 50% of MSP | 3138 | 3592 | 3951 | |
| B | **Total Sale of Grain** | **20114** | **20470** | **21460** | |
| | | | | | |
| C | **Subsidy (A-B-C)** | **134698** | **149823** | **165862** | **450383** |
| | Other Expenditure | | | | |
| | Agriculture Production Enhancement Costs | 66000 | 33000 | 11000 | |
| | Infrastructure and logistics cost | 10000 | 10000 | 10000 | |
| | National & State Food Commission per annum | 146 | 155 | 164 | |
| | District Grievance Redressal per annum | 320 | 339 | 360 | |
| | New Scheme for special groups | 8920 | 8920 | 8920 | |
| | Maternity Benefit per annum-cash scheme | 14512 | 14512 | 14512 | |
| | Misc Costs ( PDS reforms, Addl. Staff & office etc) | 6667 | 6667 | 6667 | |
| E | **Total Other Expenditure** | **106565** | **73593** | **51622** | **231780** |
| | | | | | |
| F | **Total outflow from Govt (D+E)** | **241263** | **223416** | **217485** | **682163** |

ఆధారం : ఆహార పంటల ధరలు నిర్ణాయక సంఘం చైర్మన్ అశోక్ గుల్హాటీ ఇచ్చిన నివేదిక

# ఆహార భద్రత చట్టం అనాలోచితం

- అశోక్ గుల్హాటి

ఆహార భద్రతా బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది. దీనిని గట్టిగా సమర్థిస్తున్నవారు ఇప్పుడు ఆకలి నుండి పోషకాహార లోపం నుండి ప్రజలకు విముక్తి లభించిందని ప్రకటిస్తున్నారు. అయితే దీని ప్రభావం ద్రవ్యస్థితి మీద తీవ్రంగా ఉంటుందని, భారత వాణిజ్య విశ్వసనీయత దెబ్బతింటుందని, అభివృద్ధి మందగిస్తుందని రూపాయి విలువ మరింత దిగజారుతుందని, ద్రవ్యోల్బణం మరింత పెరుగుతుందని మరికొందరు భావిస్తున్నారు. వాస్తవాలు తెలుసుకోడానికి మరింత లోతుగా ఈ చర్యను పరిశీలించాలి.

**మొదటిది :**

ఈ ఆహార భద్రతా బిల్లు ప్రతి మనిషికి 5 కిలోల ఆహారధాన్యాలను నెలకు అందిస్తుంది. అయితే దేశంలో ఆహార ధాన్యాల తలసరి వినియోగం నెలకు 10.7 కిలోలుగా వుంది. అంటే ఈ చట్టం తర్వాత కూడా వినియోగదారులు దాదాపు సగానికి పైగా నెలసరి ఆహార ధాన్యాల కోసం మార్కెట్‌కు వెళ్లకతప్పదు.

**రెండవది :**

గత కొన్ని సంవత్సరాలుగా భారతీయుల ఆహార వినియోగంలో వైవిధ్యం పెరుగుతున్నది. ఆహారధాన్యాల నుండి ప్రజలు మరింతగా విటమినులను ఇచ్చే పండ్లు, కూరగాయల వైపు, ప్రొటీనులు ఇచ్చే పాలు, గుడ్లు, మాంసం, చేపలు వైపు అడుగులు వేస్తున్నారు. ఈ తరహా ఆహార పదార్థాలన్నీ బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసుకోవాలి. అంటే ఆహార భద్రతా చట్టం తర్వాత కూడా సామాన్య ప్రజలు తమ ఆహార పదార్థాల కోసం మార్కెట్ కొనుగోళ్ల మీద ఆధారపడక తప్పని స్థితే వుంటుంది .

ఆహారధాన్యాలు 18 శాతం, కూరగాయలు 46 శాతం, ప్రొటీన్ పదార్థాలు 11 శాతం ద్రవ్యోల్బణంతో (2012 జూలై – 2013 జూలై) వుంటే ఇక పేదలకు ఆహారహక్కు ఎక్కడ దక్కుతుంది? అందుచేత విధాన నిర్ణేతలకు నిజంగా పేదలకు తగినంత పోషక ఆహారాన్ని అందించాలన్న తలంపు వుంటే ముందుగా 12 శాతం దగ్గర వున్న ద్రవ్యోల్బణాన్ని 4 శాతం లోపలికి తీసుకురావాలి.

**మూడవది :**

**ఈ ఆహార భద్రతా బిల్లు ఖరీదు ఎంత?**

గత సంవత్సరం ఆహార సబ్సీడీకి 80,000 కోట్లు ఖర్చు అయింది. ఈ సంవత్సరం ధరల ప్రకారం ప్రత్యక్ష సబ్సీడీ 1,30,000 కోట్లుగా అంచనా వేస్తున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి కనీస మద్దతు ధరలు పెరగడం, ప్రొక్యూర్‌మెంటు రేట్లు పెరుగుదల కనీసం 8–10 శాతం అదనంగా వుంటుందనుకుంటే ఇదంతా పై మొత్తానికి జమ అవుతుంది.

2015 ఆర్థిక సంవత్సరానికి ఆహారధాన్యాల సబ్సీడీ 1,40,000 కోట్లు దాటుతుంది. దీనికి అదనంగా చేయాల్సిన ఖర్చులు చాలా వున్నాయి. ఆహారధాన్యాల నిల్వ సామర్థ్యాన్ని

### దారిమళ్లుతున్న ప్రజాపంపిణీ వ్యవస్థ ఆహారధాన్యాలు

| Cereal | Year | Allocated by Centre | Availed by states (TPDS) | Consumption | Leakage | % Leakage |
|---|---|---|---|---|---|---|
| RICE | 2004-05 | 34.45 | 16.46 | 9.9 | 6.5 | 39.8 |
| | 2009-10 | 24.82 | 23.41 | 17.5 | 5.9 | 25.1 |
| WHEAT | 2004-05 | 37.25 | 12.89 | 3.6 | 9.3 | 72.4 |
| | 2009-10 | 22.78 | 18.99 | 7.8 | 11.2 | 59.1 |
| RICE+ | 2004-05 | 71.70 | 29.35 | 13.5 | 15.9 | 54.1 |
| WHEAT | 2009-10 | 47.60 | 42.40 | 25.3 | 17.1 | 40.4 |

NOTE: In million tonnes
SOURCE: Discussion Paper On National Food Security Bill : Challenges and Options, prepared by Ashok Gulati, Jyoti Gujral and T Nandakumar

పెంచడానికి, రవాణాకు అయ్యే ఖర్చు, ప్రజా పంపిణీ వ్యవస్థ మెరుగుదలకు, వ్యవసాయంలో ఆహారధాన్యాల ఉత్పత్తి స్థిరీకరణకు ఖర్చును కలుపుకుంటే ఆహారభద్రతా చట్టానికి అయ్యే ఖర్చు 2,00,000 కోట్లు దాటుతుంది.

**నాలుగవది :**

**ప్రస్తుత పరిస్థితులలో ఇది భరించదగ్గదేనా?**

ఈ చట్టం అమలు జరపాలనుకునేవారు దీనికి అవసరమైన వనరులను సమీకరించాలి. అంటే మరో చోట సబ్సిడీలను తగ్గించాలి. ఇంధనం మీద (విద్యుత్, డీజిల్, గ్యాస్) ఎరువుల మీద సబ్సిడీలకు కోత పెట్టాలి. ఎన్నికల సంవత్సరంలో ఈ ప్రభుత్వం అలాంటి చర్యలు తీసుకోగలదా? కాని ఏదో ఒకటి చెయ్యకపోతే ఈ భారం ద్రవ్యస్థితి మీద ఒత్తిడి తెస్తుంది, ద్రవ్యోల్బణాన్ని పెంచుతుంది. వీటి పర్యవసానంగా పేదల బతుకు మరింత భారం అవుతుంది.

**ఐదవది :**

నెలకి 5 కిలోల బియ్యం ఇస్తే పోషకాహారలోపం తొలగి పోతుందన్న అపోహ కొంతమందిలో వుంది. పోషకాహార లోపం పై జరిగిన పరిశోధనలలో తేలిన విషయాలు అందరికీ తెలుసు– శుద్ధి చేసిన మంచినీరు, మెరుగైన పారిశుద్ధ్యం, స్త్రీ విద్య తోడైతేనే ఇది సాధ్యం. దీనికి చాలా పెట్టుబడి కావాలి. ఈ బిల్లులో ప్రత్యక్షంగా ఈ పెట్టుబడుల అంశాన్ని ప్రస్తావించలేదు.

**ఆరవది :**

**ఆహార భద్రతా బిల్లు నుండి మంచి చెయ్యడం ఎలా?**

సంక్షేమ పథకాల మీద ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయిలోనూ కేవలం 15 పైసలు మాత్రమే పేదలకు చేరుతుందని ఒకనాడు రాజీవ్‌గాంధీ చెప్పిన మాటను మనం గుర్తు చేసుకోవాలి. అందుచేత తక్షణం చెయ్యాల్సిన పని ప్రజా పంపిణీ వ్యవస్థలో లీకేజిని (దుర్వినియోగాన్ని) ఆపాలి. ఇక్కడ 40 శాతం దారి మళ్లుతుందని లెక్కలు చెబుతున్నాయి. గత 50 ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వాలు చెయ్యలేని దానిని ఇప్పుడు ఒకటి రెండేళ్లలో వారు సాధిస్తారంటే అనుమానమే. ఇలా ఆహారధాన్యాలు దేశంలో దారి మళ్లడాన్ని ప్రత్యేకించి యు.పి., బీహార్, జార్ఖండ్, రాజస్థాన్‌లలో దృష్టి పెట్టకపోతే ఆహారభద్రతా చట్టం అత్యంత ఖరీదైందిగా, విఫల ప్రయోగంగానూ మిగులుతుంది.

ఇకపోతే ఆహారధాన్యాలు సేకరించి చేసే రాష్ట్రాలలో ఆహారధాన్యాల మీద పన్నులను క్రమబద్ధం చెయ్యాలి. కొన్ని చోట్ల అది 14.5 శాతానికి (పంజాబ్) చేరింది. అలాగే రాష్ట్రాలలో ధాన్య సేకరణ ఏజన్సీలు పెడుతున్న ఖర్చులను తగ్గించడానికి బహిరంగ బిడ్డింగ్ ద్వారా ప్రయివేటు రంగం సేవలను వినియోగించుకోవాలి.

**నగదు బదిలీ :**

వీటన్నింటినీ మించి ఆహార పదార్థాలకు బదులు నగదు బదిలీకి దారులను తెరవాలి. 10 లక్షల జనాభా దాటిన 33 నగరాలలో బ్యాంకింగ్ సౌకర్యాలు విరివిగా వున్నందున ఆధార్ కార్డు ప్రాతిపదికగా నగదు బదిలీ పద్ధతిని ప్రవేశపెట్టాలి. అలాగే ఆహారధాన్యాల పంటలు పండించే రైతులు ఒక పక్క అమ్మకం దారుగా, మరోపక్క కొనుగోలు దారుగా వుంటున్నారు. ఆహార పథకం వర్తించే వారికి ప్రత్యక్షంగా డబ్బు రూపంలోనే అందించవచ్చును.

చివరిగా విధాన రూపకల్పన అన్నది అనుకున్న లక్ష్యాలను అతి తక్కువ ఖర్చుతో సాధించే కళగా వుండాలి. అంతర్జాతీయంగా అనేక దేశాలలో అమలు చేస్తున్న పద్ధతులు (బ్రెజిల్, మెక్సికో) అలాంటి విజ్ఞతని చాటుతున్నాయి. చౌకగా ఆహార పదార్థాలు అందించే పద్ధతి కాకుండా షరతులతో కూడిన నగదు బదిలీల వంటి సాధనాలతో లక్ష్యాలు సాధిస్తున్నారు. అలాంటి పద్ధతులు పాటిస్తే అగ్రి మార్కెట్‌లకు, ఉత్పత్తి వ్యవస్థలకు ఎలాంటి నష్టం కలిగించకుండా 40,000 కోట్లు ఆదా చెయ్యవచ్చును. ఇలాంటి ప్రత్యామ్నాయాలను భారతదేశం అనుసరిస్తుందా?. ■

**రచయిత: - ఆహార పంటల ధరలు నిర్ణాయక సంఘం ఛైర్మన్**



# ఆహార భద్రత రాష్ట్రానికి భారమే!

ఆహార భద్రత పథకం రాష్ట్ర ప్రభుత్వానికి మింగుడు పడనిదిగా మారింది. ఈ పథకాన్ని అమలు చేస్తే రాష్ట్ర ఖజానాపై ఏటా రూ. 2500 కోట్ల నుంచి రూ. 3000 కోట్ల దాకా అదనపు భారం పడుతుందని అధికారుల అంచనా. దారిద్ర్య రేఖకు దిగువనున్న వారి సంఖ్యకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ లెక్కల మధ్య వ్యత్యాసం ఉండటం, ఒక్కొక్కరికి ఇచ్చే బియ్యం కేజిల్లో తేడా ఉండటమే దీనికి ప్రధాన కారణం. కేంద్ర బిల్లు ప్రకారం... రాష్ట్రానికి 20.40 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఏటా అదనంగా అవసరం. గ్రామీణ ప్రాంతాల్లో కాస్త అటు ఇటుగా 60 శాతం, పట్టణ ప్రాంతాల్లో 40 శాతం మందికి ఆహార భద్రత పథకాన్ని వర్తింపజేయాలని కేంద్రం స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఆ ప్రకారం రాష్ట్రంలో 4.61 కోట్ల మందే పథకానికి అర్హులవుతారు. అంటే నెలకు 2.55 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కావాలి. కేంద్రం ఈ బియ్యాన్ని అందజేస్తుంది. ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సుమారు 8 కోట్ల మంది లబ్ధిపొందుతున్నారు. అంటే కేంద్రం లెక్కల కన్నా 3.39 కోట్ల మంది అదనంగా ప్రయోజనం పొందుతున్నారు. కేంద్రం మూడు రూపాయలకు బియ్యం విక్రయించాలని చెబుతుంటే... రాష్ట్రంలో రూపాయికే విక్రయించే పథకం అమలులో ఉంది. పీడీఎస్ కింద రాష్ట్రంలో ప్రస్తుతం నెలకు 4.25 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం. అంటే నెలకు 1.70 లక్షల టన్నులు అదనంగా కావాలి.

- బిల్లు ప్రకారం రాష్ట్రంలో అర్హులు – 4.60 కోట్ల మంది.
- రూపాయి కిలో బియ్యం ద్వారా లబ్ధిదారులు – 8 కోట్ల మంది.

**మనిషికి 5 కిలోలు :** రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఒక్కొక్కరికి నాలుగు కిలోల చొప్పున బియ్యం అందచేస్తోంది. కేంద్రం తెస్తున్న ఆహార భద్రత పథకం ద్వారా ప్రతి మనిషికీ 5 కిలోల చొప్పున ఇవ్వాలి. కుటుంబానికి గరిష్టంగా 35 కిలోలు పంపిణీ చేయాలి. ఇది రాష్ట్ర ప్రభుత్వంపై భారానికి కారణంగా మారుతోంది. ఈ భారాన్ని కేంద్రమే భరించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినా ఇప్పటిదాకా ఎలాంటి స్పందన లేదని ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ■



# లైసెన్స్-పర్మిట్ వ్యవస్థ అవశేషం ఆహార భద్రతా బిల్లు: జేపీ

అవినీతి, అసమర్థ, లొసుగులమయమై అభాసుపాలైన ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్)ను ఆహార భద్రత పేరిట విస్తరించటం ఓ పెద్ద ప్రహసనం, విషాదం అని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ మంగళవారం అన్నారు.

ఆగస్టు 26న లోక్‌సభ ఆమోదించిన ఆహార భద్రతా బిల్లుపై జేపీ వ్యాఖ్యానిస్తూ... ఇది తిరోగమనమే, పాత లైసెన్స్-పర్మిట్-కోటా వ్యవస్థలోకి జారిపోవటమే అన్నారు.

భారతదేశంలో మూడు నుంచి ఐదు శాతం మంది ఆహారం లేక అలమటిస్తున్నారనటంలో సందేహం లేదని జేపీ అన్నారు. వారి మీద దృష్టి కేంద్రీకరించటానికి బదులు, దేశ జనాభాలో 67శాతానికి వర్తించేలా పీడీఎస్‌ని విస్తరించే మార్గంలో ప్రభుత్వం వెళ్తోందన్నారు. పేదరిక స్థాయిలను గణనీయంగా తగ్గించామని జబ్బలు చరుచుకుంటున్న సర్కారే, మూడొంతుల ప్రజలకు ఆహార భద్రతకల్పించే బిల్లును ప్రవేశపెట్టటం హాస్యాస్పదమన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లాంటి రాష్ట్రాలలో 90శాతానికిపైగా ప్రజలు పీడీఎస్ పరిధిలోకి వస్తున్నారని జేపీ గుర్తుచేశారు. పీడీఎస్ ద్వారా పంపిణీ అయిన ఆహార ధాన్యాలలో 40శాతానికి పైగా నల్లబజారులో అమ్ముడవుతున్నాయని, రీసైకిల్ ద్వారా భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ)కే చేరుతున్నాయని అన్నారు. సబ్సిడీగా చెబుతున్నదంతా అవినీతి ఉద్యోగులు, రాజకీయవేత్తలు, నీతిబాహ్య వ్యాపారుల జేబులు నింపడానికే ఉపయోగ పడుతోందన్నారు. హైదరాబాద్‌లాంటి నగరాలలో రేషన్ దుకాణం కేటాయింపునకు రూ. 3లక్షలు చెల్లింపు, పోస్టింగ్‌కి భారీ డిమాండ్ ఉండటం సర్కారీ పౌరసరఫరాలు, విజిలెన్స్ విభాగాలలో పాతుకుపోయిన విశృంఖల అవినీతికి అద్దం పడతాయన్నారు.

ఆహార భద్రత పేరుతో ధాన్యాల పంపిణీకే పెద్దపీట వేయటాన్ని కూడా జేపీ తప్పుపట్టారు. భారతదేశంలో పౌష్టికాహార లోపం ప్రోటీనులకు సంబంధించిందే తప్ప కేలరీలకు సంబంధించింది కాదని అన్నారు. దేశం నలుమూలలా ఆహారం అందుబాటులో ఉందన్నారు. సమస్య - కొనుగోలు శక్తి లేకపోవటంతప్ప ఆహారం అందుబాటులో లేకపోవటం కాదన్నారు. నిజమైన పేదలకు ఆహార స్టాంపుల్ని పంపిణీ చేయటమే సరైన పరిష్కారమన్నారు.

ప్రభుత్వ గోదాములలో సుమారు 8 కోట్ల టన్నుల ఆహారధాన్యాలు మూలుగుతున్నాయని, వీటిలో చాలావరకు వానలు, ఎండలు, పందికొక్కుల పాలవుతున్నాయని, మిగులు ఆహారధాన్యాల్ని ఎగుమతి చేస్తే భారత్ కనీసం 10 బిలియన్ అమెరికన్ డాలర్లను ఆర్జించగలదని, కరెంటు ఖాతా లోటు సమస్యను కొంతవరకైనా ఎదుర్కోగలదని జేపీ అన్నారు. ఈ పనిచేయకుండా, అవినీతి, అసమర్థ సేకరణ, నిల్వ విధానాన్నే ప్రభుత్వం ఎంచుకుందన్నారు. పప్పులు, వంటనూనెపై కనీస స్థాయి దిగుమతి సుంకం విధించి, ఆ ఆదాయాన్ని స్వదేశంలో ఉత్పత్తి పెంపునకు వినియోగిస్తే మరో 10 బిలియన్ అమెరికన్ డాలర్లను మనదేశం ఆదా చేసుకోగలదన్నారు. భారత్ ఈవేళ ప్రపంచంలోనే అత్యధికస్థాయిలో పప్పుల్ని, వంటనూనెను దిగుమతి చేసుకునే దేశంగా ఉందని, విధానాల్ని సరిదిద్దుకోకపోతే ఎప్పటికీ దిగుమతి దేశంగానే మిగిలిపోతుందని అన్నారు.

కొనుగోలు శక్తిని పెంచుకునే అవకాశాల్ని పేదలకు కల్పించినప్పుడే పేదరికాన్ని తొలగించగలమని జేపీ స్పష్టంచేశారు. వారికి నాణ్యమైన విద్య, నైపుణ్యాలు, ఉపాధిని కల్పించినప్పుడే ఇది సాధ్యమవుతుందన్నారు. అటువంటి విధానానికి చాలా కష్టపడటం, నిబద్ధత కూడిన రాజకీయాలు అవసరమన్నారు. అందుకు బదులు, మెజారిటీ భారతీయులకు ఆహార భద్రత వంటి పథకాల ద్వారా ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతోందన్నారు.

తక్కువ స్థాయి ఉత్పత్తి నుంచి పైస్థాయికి ఎదిగే క్రమంలో చైనా వదిలిన ఖాళీని భర్తీ చేసేందుకు బంగ్లాదేశ్, థాయ్‌లాండ్,

వియత్నాంలాంటి దేశాలు ప్రయత్నించటాన్ని ఈ సందర్భంగా జేపీ వివరించారు. తమ ప్రజలకు ఉద్యోగావకాశాలను కల్పిస్తూ ఆ చిన్న దేశాలు పెద్ద ఎగుమతిదారులుగా అవతరిస్తున్నాయన్నారు. మౌలిక సదుపాయాలు, ఉద్యోగాల సృష్టి మీద కేంద్రీకరించకుండా, భారతదేశ పాలకులు ఆహార భద్రత వంటి పథకాల ద్వారా పాత లైసెన్స్-పర్మిట్ వ్యవస్థలోకి తిరోగమిస్తూ తమ నైతిక, మేధో దివాళాకోరుతనాన్ని చాటుతున్నారన్నారు.

ఏ మాత్రం గిట్టుబాటు కాకపోవటంతో ఇప్పటికే లక్షలాది రైతులు వ్యవసాయరంగాన్ని వదిలిపోతున్నారని, ప్రభుత్వ ఆహార భద్రతా పథకం వల్ల వ్యవసాయ సంక్షోభం పెను తీవ్రతరమవుతుందని జేపీ హెచ్చరించారు. అత్యధికులకు భారీ రాయితీ ధరలతో ఆహార ధాన్యాల సరఫరా చేయటం కోసం ప్రభుత్వమే ధాన్యాల ధరల్ని కృత్రిమంగా అణగదొక్కుతుందని, దీంతో ప్రతిపాదిత ఆహార భద్రత ప్రత్యక్ష పర్యవసానంగా రైతులు మరింత పేదరికంలోకి కూరుకుపోతారని అన్నారు.

పేదరికాన్ని నిర్మూలించి, సుస్థిర అభివృద్ధిని పెంపొందించాలంటే 'ఉద్యోగాలు, ఉద్యోగాలు, ఉద్యోగాలు' తప్ప మరో మంత్రం లేదని, ఆహార భద్రత వంటి చిట్కాలతో ఫలితం ఉండదని జయప్రకాష్ నారాయణ్ ఒక ప్రకటనలో స్పష్టంచేశారు. ■

## రాష్ట్రాలలో వివిధ రకాల రేషన్ కార్డులు

(Figures in lakhs)

(As reported by 30.06.2013)

| S. No. | STATE/UT | PROJECTED POPULATION IN 2000 | % OF BPL POPULATION | SIZE OF HOUSE HOLDS | NO. OF HOUSE HOLDS IN 2000 | NO. OF BPL HOUSE HOLDS IN 2000 | RATION CARDS ISSUED: BPL | AAY | TOTAL (BPL+AAY) | LESS/ EXCESS RATION CARDS (10-7) | APL | TOTAL (10+12) |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 |
| 1 | Andhra Pradesh | 754.66 | 25.68 | 4.77 | 158.21 | 40.63 | 199.93 | 15.58 | 215.51 | 174.88 | 29.94 | 245.45 |
| 2 | Arunachal Pradesh | 11.92 | 40.86 | 4.93 | 2.42 | 0.99 | 0.61 | 0.38 | 0.99 | 0.00 | 2.19 | 3.18 |
| 3 | Assam | 261.96 | 40.86 | 5.83 | 44.93 | 18.36 | 12.02 | 7.04 | 19.06 | 0.70 | 40.87 | 59.93 |
| 4 | Bihar | 731.11 | 54.96 | 6.16 | 118.79 | 65.23 | 39.22 | 25.01 | 64.23 | -1.00 | 15.53 | 79.76 |
| 5 | Chhattisgarh | 249.25 | 42.52 | 5.65 | 44.11 | 18.75 | 11.56 | 7.19 | 18.75 | 0.00 | 26.42 | 45.17 |
| 6 | Delhi | 139.64 | 14.69 | 5.02 | 27.82 | 4.09 | 1.67 | 1.50 | 3.17 | -0.92 | 20.25 | 23.42 |
| 7 | Goa | 15.95 | 14.92 | 4.99 | 3.20 | 0.48 | 0.17 | 0.14 | 0.31 | -0.17 | 3.60 | 3.91 |
| 8 | Gujarat | 482.52 | 24.21 | 5.51 | 87.57 | 21.20 | 25.11 | 8.10 | 33.21 | 12.01 | 79.99 | 113.20 |
| 9 | Haryana | 198.31 | 25.05 | 6.30 | 31.48 | 7.89 | 9.94 | 2.92 | 12.86 | 4.97 | 45.64 | 58.50 |
| 10 | Himachal Pradesh | 67.11 | 40.86 | 5.34 | 12.57 | 5.14 | 3.17 | 1.97 | 5.14 | 0.00 | 10.71 | 15.85 |
| 11 | Jammu & Kashmir | 99.45 | 40.86 | 5.52 | 18.02 | 7.36 | 4.80 | 2.56 | 7.36 | 0.00 | 12.36 | 19.72 |
| 12 | Jharkand | 268.31 | 54.96 | 6.16 | 43.56 | 23.94 | 14.76 | 9.18 | 23.94 | 0.00 | 5.15 | 29.09 |
| 13 | Karnataka | 520.91 | 33.16 | 5.52 | 94.37 | 31.29 | 86.41 | 11.38 | 97.79 | 66.50 | 34.39 | 132.18 |
| 14 | Kerala | 322.62 | 25.43 | 5.28 | 61.10 | 15.54 | 14.47 | 5.96 | 20.43 | 4.89 | 59.01 | 79.44 |
| 15 | Madhya Pradesh | 548.22 | 42.52 | 5.65 | 97.03 | 41.25 | 52.48 | 15.82 | 68.30 | 27.05 | 79.92 | 148.22 |
| 16 | Maharashtra | 911.15 | 36.86 | 5.14 | 177.27 | 65.34 | 45.88 | 24.64 | 70.52 | 5.18 | 139.53 | 210.05 |
| 17 | Manipur | 25.18 | 40.86 | 5.19 | 4.07 | 1.66 | 1.02 | 0.64 | 1.66 | 0.00 | 2.41 | 4.07 |
| 18 | Meghalaya | 24.34 | 40.86 | 5.42 | 4.49 | 1.83 | 1.13 | 0.70 | 1.83 | 0.00 | 2.66 | 4.49 |
| 19 | Mizoram | 9.52 | 40.86 | 5.70 | 1.67 | 0.68 | 0.42 | 0.26 | 0.68 | 0.00 | 1.89 | 2.57 |
| 20 | Nagaland | 16.84 | 40.86 | 5.57 | 3.02 | 1.24 | 0.77 | 0.47 | 1.24 | 0.00 | 1.16 | 2.40 |
| 21 | Orissa | 358.57 | 48.56 | 5.28 | 67.91 | 32.98 | 36.78 | 12.65 | 49.43 | 16.45 | 34.58 | 84.01 |
| 22 | Punjab | 235.36 | 11.77 | 5.92 | 39.76 | 4.68 | 2.89 | 1.79 | 4.68 | 0.00 | 55.59 | 60.27 |
| 23 | Rajasthan | 535.59 | 27.41 | 6.04 | 88.67 | 24.31 | 16.53 | 9.32 | 25.85 | 1.54 | 111.68 | 137.53 |
| 24 | Sikkim | 5.59 | 41.43 | 5.33 | 1.05 | 0.43 | 0.27 | 0.16 | 0.43 | 0.00 | 4.06 | 4.49 |
| 25 | Tamilnadu * | 617.74 | 35.03 | 4.45 | 138.82 | 48.63 | 176.78 | 18.65 | 195.43 | 146.80 | 0.00 | 195.43 |
| 26 | Tripura | 37.82 | 40.86 | 5.24 | 7.22 | 2.95 | 1.82 | 1.13 | 2.95 | 0.00 | 6.34 | 9.29 |
| 27 | Uttar Pradesh | 1626.04 | 40.85 | 6.22 | 261.42 | 106.79 | 65.84 | 40.95 | 106.79 | 0.00 | 331.19 | 437.98 |
| 28 | Uttarakhand | 75.84 | 40.85 | 6.22 | 12.19 | 4.98 | 3.07 | 1.91 | 4.98 | 0.00 | 19.39 | 24.37 |
| 29 | West Bengal | 790.06 | 35.66 | 5.44 | 145.23 | 51.79 | 39.92 | 14.80 | 54.72 | 2.93 | 131.34 | 186.06 |
| 30 | A&N Islands | 3.86 | 34.47 | 4.75 | 0.81 | 0.28 | 0.08 | 0.04 | 0.12 | -0.16 | 0.92 | 1.04 |
| 31 | Chandigarh | 8.88 | 11.35 | 4.38 | 2.03 | 0.23 | 0.09 | 0.02 | 0.11 | -0.12 | 2.31 | 2.42 |
| 32 | D&N Haveli | 1.90 | 50.84 | 5.28 | 0.36 | 0.18 | 0.12 | 0.05 | 0.17 | -0.01 | 0.55 | 0.72 |
| 33 | Daman & Diu | 1.40 | 15.80 | 5.30 | 0.26 | 0.04 | 0.03 | 0.01 | 0.04 | 0.00 | 0.33 | 0.37 |
| 34 | Lakshdweep | 0.71 | 25.04 | 6.23 | 0.11 | 0.03 | 0.02 | 0.01 | 0.03 | 0.00 | 0.15 | 0.18 |
| 35 | Puducherry | 11.11 | 37.40 | 4.97 | 2.24 | 0.84 | 1.17 | 0.32 | 1.49 | 0.65 | 1.91 | 3.40 |
| | **TOTAL** | **9969.44** | **36.00** | **5.51** | **1803.78** | **652.03** | **870.95** | **243.25** | **1114.20** | **462.17** | **1313.96** | **2428.16** |

* Separate figures of APL/BPL cards has not been made available by the Govt. of Tamil Nadu as there is no categorisation of APL/BPL households

# వివిధ రాష్ట్రాలలో రేషన్ షాపులలో అమ్మకం ధరలు

(As compiled on 30.06.2013)

**ISSUE PRICES AT FAIR PRICE SHOPS IN STATES/UTs**
**(As reported by each State/UT from time to time)**

(Rs. Per Kg.)

| S. No | States | BPL | | AAY | | APL | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | | Wheat | Rice | Wheat | Rice | Wheat | Common Rice | Rice Gr.A | Reported Vide letter Dated |
| 1 | Andhra Pradesh | 7.00 | 1.00 | 7.00 | 1.00 | 7.00 | - | | 14.12.12 |
| 2 | Arunachal Prd. | 4.65 | 6.15 | - | 3.00 | 6.60 | 7.45 | 8.80 | 17.07.12 |
| 3. | Assam | - | 7.00 | - | 3.00 | 8.50 | 10.00 | | 30.03.12 |
| 4. | Bihar | 5.22 | 6.78 | 2.00 | 3.00 | 7.00 | 9.05 | 9.41 | 20.06.12 |
| 5. | Chattisgarh | 2.00 | 2.00 | - | 1.00 | 8.50 | 11.50 | | 02.05.12 |
| 6. | Delhi | 4.80 | 6.30 | 2.00 | 3.00 | 7.05 | - | 9.25 | 20.03.12 |
| 7. | Goa | 4.80 | 6.15 | - | 3.00 | 6.60 | - | 8.95 | 25.03.13 |
| 8. | Gujarat | Rs.2.00 for 13 kg Rs.5.40 for 11 kg (for wheat spl.) | Rs 3.00 for 3 kg(Max) Rs. 7.00 for 8 kg(Max Rice Spl.) | 2.00 | 3.00 | 7.50 | - | | 05.06.13 |
| 9. | Haryana | 5.20 | - | 2.12 | - | 6.93 | - | | 30.04.13 |
| 10. | Himachal Prd. | 5.25 | 6.85 | 2.00 | 3.00 | 8.50 | 10.00 | | 06.04.12 |
| 11. | J & K | 4.80 5.35 (Atta) | 6.40 | 2.00 2.00 (Atta) | 3.00 | 7.25 8.00 (Atta) | 10.00 | | 09.04.12 |
| 12. | Jharkhand | - | 1.00 | - | 1.00 | 6.88 | 9.21 | | 22.03.12 |
| 13. | Karnataka | 3.00 | 3.00 | 2.00 | 3.00 | 8.00 | 10.00 | | 20.05.13 |
| 14. | Kerala | 2.00 | 1.00 | - | 1.00 | 6.70 (Non subsidised) 2.00 (Subsidised) | 8.90(Non subsidised) 2.00(Subsidised) | | 27.12.12 |
| 15. | Madhya Prd. | 3.00 | 4.50 | 2.00 | 3.00 | 9.00 | 11.00 | | 26.08.10& 31.03.12 |
| 16. | Maharashtra | 5.00 | 6.00 | 2.00 | 3.00 | 7.20 | 9.60 | | 17.02.12 |
| 17. | Manipur | - | 6.15 | - | 3.50 | - | 8.80 | | 08.02.12 |
| 18. | Meghalaya | - | 6.15-7.50 | - | 3.00 | 7.00 to 8.25 | 9.50 to 11.00 | | 13.04.12 |
| 19. | Mizoram | - | 6.15 | - | 3.00 | - | 9.50 | | 04.06.13 |
| 20. | Nagaland | 6.25 (Atta) | 6.15 | 2 | 3 | 6.10 + Actual | 8.30 + Actual Transportation cost + | | 21.03.12 |

# వివిధ రాష్ట్రాలలో రేషన్ షాపులలో అమ్మకం ధరలు

(As compiled on 30.06.201

**ISSUE PRICES AT FAIR PRICE SHOPS IN STATES/UTs**

**(As reported by each State/UT from time to time)**

(Rs. Per Kg.)

| S. No | States | BPL | | AAY | | APL | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | | Wheat | Rice | Wheat | Rice | Wheat | Common Rice | Rice Gr.A | Reported Vide letter Dated |
| | | | | | | Transportation cost + FPS dealers handling cost | FPS dealers handling cost | | |
| 21. | Orissa | - | 2.00 | - | 2.00 | 7.00 | 9.30 | | 11.07.12 |
| 22. | Punjab | 4.57 | - | 2.00 | - | 8.06 | - | | 21.03.12 |
| 23. | Rajasthan | 2.00 | - | 2.00 | - | 7.00/ 8.10 & 8.60 for flour | - | | 05.07.12 |
| 24. | Sikkim | - | 4.00 | - | Free of cost | - | 9.00 | | 14.03.12 |
| 25. | Tamil Nadu | 7.50 | Free of cost | 7.50 | Free of cost | 7.50 | Free of cost | | 17.07.12 |
| 26. | Tripura | 10.00 (Atta) | 2.00 | 10.00 (Atta) | 2.00 | 10.00 (Atta) | - | 10.35 | 31.05.13 |
| 27. | Uttar Pradesh | 4.65 | 6.15 | 2.00 | 3.00 | 6.60 | 8.80 | | 10.07.12 |
| 28. | Uttarakhand | 2.00 | 3.00 | 2.00 | 3.00 | 4.00 | 6.00 | | 16.08.11 |
| 29. | West Bengal | 4.65 | 2.00 | 2.00 | 2.00 | 6.75 | 9.00 | | 20.11.12 |
| 30. | A&N Islands | 4.45 | 6.05 | 2.00 | 3.00 | 7.70 | 10.00 | | 28.03.12 |
| 31. | Chandigarh | 4.65 | 6.15 | - | 3.00 | - | 8.00 | | 11.04.12 |
| 32. | D&N Haveli | 4.65 | 6.00 | 2.00 | 3.00 | 6.50 | 8.50 | | 16.07.12 |
| 33. | Daman & Diu | 4.80 | 6.45 | 2.00 | 3.00 | 6.90 | - | 9.30 | 07.05.13 |
| 34. | Lakshadweep | 9.00 | 6.15 | 9.00 | 3.00 | 9.00 | 10.40 | | 08.03.12 |
| 35. | Puducherry | Free of cost | | - | Free of cost | Free of cost | | | 28.05.13 |

BPL : దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలు

AAY : అంత్యోదయ అన్నయోజన

APL : దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్న కుటుంబాలు

# రైతుకి, పరిశ్రమకీ ఉపయోగపడని భూ సేకరణ బిల్లు: జేపీ

లోక్‌సభ ఆగస్టు 30న ఆమోదించిన భూ సేకరణ బిల్లు అటు భూమిని కోల్పోయే రైతుకి న్యాయం అందించేదికాదు, ఇటు పరిశ్రమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి దోహదం చేసేదికాదు అని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

రైతులకు మేలు చేస్తున్నామన్న ముసుగులో ఈ బిల్లు, భూ సేకరణ ఆమోదానికి జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిలలో కమిటీల రూపంలో అన్ని రకాల బ్యూరోక్రాటిక్ అవరోధాలను సృష్టిస్తుందని జేపీ అన్నారు. సామాజిక ప్రభావ అంచనాలు, పునరావాస నిబంధనల వల్ల ఏ కాస్త భూమిని సేకరించాలన్నా అసాధ్యమనిపించే పరిస్థితులు ఏర్పడతాయన్నారు. ఫలితంగా, రైతుకి లాభం జరగదని, ఆర్థిక కలాపాలు ఏళ్ల తరబడి స్తంభించిపోతాయని, దేశం 1970ల నాటి లైసెన్స్-పర్మిట్ వ్యవస్థలోకి దిగజారిపోతుందని అన్నారు.

ప్రజాప్రయోజనాల కోసం చేసే భూసేకరణలో దశాబ్దాల తరబడి రైతులకు అన్యాయం జరిగిందని జేపీ అన్నారు. పరిహారం పేరుతో వారికి చెల్లించిన డబ్బు మార్కెట్ ధర కంటే ఎంతో తక్కువగా ఉండేదన్నారు. ఆ స్వల్ప పరిహారం చెల్లింపులో కూడా విపరీత జాప్యం చేసేవారన్నారు. భూముల కొనుగోలుదారులు నానాటికీ అభివృద్ధి చెందుతుండగా, భూములు కోల్పోయినవారు పేదరికంలో మిగిలిపోయేరీతిలో భూ సేకరణ విధానం కొనసాగిందన్నారు.

పారిశ్రామికీకరణకు, మౌలిక వసతుల అభివృద్ధికి భూ సేకరణ తప్పనిసరి అవసరమని జేపీ స్పష్టంచేశారు. భారత్‌లో పరిమిత భూమి ఉందన్నారు. ప్రపంచంలో ఉన్న వ్యవసాయ భూమిలో 11 శాతం, సుమారు 40 కోట్ల ఎకరాలు మనదేశంలో ఉందన్నారు. ప్రత్యేక ఆర్థిక మండళ్ల (ఎస్ఈజెడ్‌లు) కోసం ఇప్పటివరకూ సేకరించిన భూమి 200,000 ఎకరాలు మాత్రమేనన్నారు. పరిశ్రమలు, మౌలిక వసతుల అభివృద్ధికి కావలసిన భూమి అందుబాటులో ఉన్న భూమిలో 1శాతం లోపు మాత్రమే ఉంటుందన్నారు.

ఇటువంటి నేపథ్యంలో తీసుకొచ్చే భూసేకరణ విధానం, భూమిని కోల్పోయే రైతులను విజేతలుగా నిలబెడుతూ, పరిశ్రమలు, మౌలిక వసతుల అభివృద్ధి, పట్టణీకరణ, ఆర్థికాభివృద్ధికి భూమిని త్వరితంగా అందుబాటులోకి తెచ్చేదిగా ఉండాలని జేపీ అన్నారు. రైతులకు మార్కెట్ ధర కంటే కూడా కొన్ని రెట్లు ఎక్కువ పరిహారం వచ్చేలా బిల్లులో గ్యారంటీ ఏర్పాటు ఉండాలన్నారు. భూ సేకరణ జరిగిన సందర్భాలలో, భూమిని కోల్పోయేవారికి న్యాయబద్ధమైన పరిహారం వచ్చేలా బిల్లులో ఉన్న నిబంధలను లోక్‌సత్తా స్వాగతిస్తుందన్నారు.

భూమిని కోల్పోయిన రైతుల పిల్లలకు నైపుణ్యాలు, భూసేకరణ తర్వాత చేపట్టే ఆర్థిక కలాపాలలో



ఉద్యోగావకాశాలను కల్పించాలని జేపీ అన్నారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను ఏర్పాటుచేసినప్పుడు భూములు కోల్పోయిన 8000 నిర్వాసితుల కుటుంబాలలోని వారికి భారీస్థాయిలో శిక్షణనిప్పించి శాశ్వత ఉపాధిని కల్పించే అవకాశం తనకు లభించిందని ఈ సందర్భంగా జేపీ ఉటంకించారు. ఈ తరహా ఏర్పాటు ప్రస్తుత భూ సేకరణ బిల్లులో లేదన్నారు.

మరో కీలకాంశంపై కూడా బిల్లులో ప్రస్తావన లేదని జేపీ అన్నారు. ఒకసారి ఒక ప్రాజెక్టు కోసం భూమిని సేకరించాక దాని విలువ శరవేగంగా పెరుగుతుందని, ఒక్కోసారి 100 రెట్లకు పైగా కూడా పెరగవచ్చని జేపీ అన్నారు. ఆ విషయాన్ని కూడా పరిగణలోకి తీసుకుని, ఏ ప్రాజెక్టు కోసమైనా అవసమైనదానికంటే రెట్టింపు భూమిని సేకరించాలని, అభివృద్ధి చేశాక అందులో సగం భూమిని రైతులకు తిరిగి ఇవ్వాలని అన్నారు. అటువంటి విధానం వల్ల, రైతులు పరిహారంతోపాటు అనేక రెట్లు ఎక్కువ విలువ ఉన్న అభివృద్ధి చేసిన భూమిని కూడా పొందగలుగుతారన్నారు.

యువత, మహిళలు ఉపాధి అవకాశాల కోసం సతమతమవుతూ, దేశంలో మౌలిక సదుపాయాలు, ఉత్పత్తిరంగం నిర్వీర్యమైపోయి ఉన్న ప్రస్తుత తరుణంలో - సవాళ్లను స్వీకరించి, పరిశ్రమలు, ఇతర ఆర్థిక సాహసాలు చేసేందుకు ఔత్సాహికులు పెద్దసంఖ్యలో ముందుకొచ్చేలా ప్రోత్సాహాన్నందించే చట్టాలు ఉండాలని జేపీ అన్నారు. ప్రస్తుత భూసేకరణ బిల్లు ఆ రకంగా లేదని, పారిశ్రామికవేత్తలకు ముందరికాళ్ల బంధం వేస్తూ, కోట్లాది యువత ఆశలను నీరుగార్చేలా ఉందని జయప్రకాష్ నారాయణ్ ఒక ప్రకటనలో అన్నారు.

## భూసేకరణ బిల్లులోని ముఖ్యాంశాలు

### ఆగస్టు 30న లోక్‌సభ ఆమోదించిన బిల్లులోని ముఖ్యాంశాలు

- గ్రామీణ ప్రాంతాల్లో మార్కెట్ విలువకు నాలుగు రెట్ల దాకా, పట్టణ ప్రాంతాల్లో రెండు రెట్లదాకా పరిహారం అందివ్వాలని బిల్లు ప్రతిపాదిస్తోంది. ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్య (పీపీపీ) ప్రాజెక్టులకు భూసేకరణ చేయాలంటే 70 శాతందాకా, ప్రయివేటు కంపెనీలకు భూ సేకరణ చేయాలంటే 80 శాతందాకా తప్పనిసరి సమ్మతి ఉండాలి.
- భూమికి భూమి, ఇళ్ల మంజూరు, ఉపాధి, సేకరించిన భూమికి ఏకమొత్తంలో చెల్లించిన నగదుకు అదనంగా జీవితాంతం వడ్డీ లాంటి ప్రతిఫలం తదితర ప్రయోజనాలు.
- గతంలో జరిగిన అన్యాయాలను సరిదిద్దడంలో భాగంగా... గతంలో భూసేకరణ జరిగి, పరిహారం ఇవ్వని కేసులకూ ఈ చట్టం వర్తింపు.
- షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గ్రామసభల ఆమోదం లేకుండా భూసేకరణకు వీల్లేదు. పరిహారం పూర్తిగా చెల్లించేంతవరకు, పునరావాసానికి ప్రత్యామ్నాయ స్థలాలు సిద్ధం చేసేంతవరకు ఎవరి దగ్గర నుంచీ భూమిని తీసుకోవడానికి వీల్లేదు.
- ఆహారభద్రతకు భంగం కలగకుండా, ఏకపక్షంగా భూసేకరణ జరగకుండా ఉండేందుకు వ్యవసాయ భూముల సేకరణపై పరిమితులు విధించాలని రాష్ట్రాలకు సూచన.
- సేకరణ జరిగిన తర్వాత భూమిని ఉపయోగించకుండా ఖాళీగా అట్టిపెడితే... ఆ భూమిని తిరిగి సొంతదారుకు అప్పగించడం లేదా రాష్ట్ర భూ బ్యాంకుకు జమ చేసే అధికారం రాష్ట్రాలకు.
- భూమిని అప్పగించిన వ్యక్తికి కొత్త చట్టంలోని నిబంధనల ప్రకారం అందే మొత్తంపై ఆదాయపు పన్ను విధించరాదు. స్టాంపు రుసుం వసూలు చేయరాదు.
- సేకరించిన భూమిని మూడో పార్టీకి అధిక ధరకు విక్రయించిన పక్షంలో లాభంలో 40 శాతాన్ని అసలు సొంతదారుకు ఇవ్వాలి.
- ప్రాజెక్టుల్లో భూమిని కోల్పోయే ఎస్సీ/ఎస్టీ వర్గాల వారికి భూమికి భూమి.
- భూసేకరణతో ప్రభావితమయ్యే వారు ఎస్సీ, ఎస్టీ వర్గాలయి ఉండి వారిని మరో జిల్లాకు తరలించాల్సి వస్తే అదనంగా 25 శాతం పునరావాస పరిహారం చెల్లించాలి. ఏక మొత్తంగా చెల్లించాల్సిన రూ. 50 వేలకు ఇది అదనం. ■

# జీడీపీ తరుక్కు పోతోంది

- తొలి త్రైమాసికం వృద్ధిరేటు 4.4 శాతమే
- నాలుగేళ్లలో అత్యంత కనిష్ట స్థాయి ఇది
- తయారీ, గనుల రంగాల్లో క్షీణలే ప్రధాన కారణం
- వ్యవసాయ రంగంలో 2.7% వృద్ధి

దేశ, ఆర్థిక వ్యవస్థ నానాటికీ క్లిష్ట పరిస్థితుల్లోకి జారుకొంటోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి (ఏప్రిల్–జూన్ మధ్య) ఆర్థిక వృద్ధి రేటు (దీనినే స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) అని అంటారు) 4.4 శాతానికి పరిమితమైనట్లు కేంద్ర గణాంకాల సంస్థ (సీఎస్ఓ) ప్రకటించింది. గత నాలుగేళ్లలో ఇది అత్యంత తక్కువ త్రైమాసిక వృద్ధి రేటు కావడం గమనార్హం. తయారీ, గనుల తవ్వకం రంగాల్లో ఉత్పత్తి క్షీణించడం ఈ పరిస్థితికి ప్రధాన కారణం కాగా నిపుణులు, మార్కెట్ వర్గాలు జీడీపీ తొలి త్రైమాసికానికి 4.8 శాతం వృద్ధి ఉండవచ్చని అంచనా వేశాయి. కానీ ఆ అంచనాల కన్నా తక్కువ వృద్ధే చోటు చేసుకొంది. గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో (అంటే ఈ ఏడాది జనవరి–మార్చి మధ్య) వృద్ధి రేటు 4.8 శాతం ఉంది. ఒక ఏడాది క్రితం ఇదే కాలంలో (2012 ఏప్రిల్–జూన్ మధ్య) 5.4 శాతంగా నమోదైంది. అంటే ఏడాది క్రితంతో పోలిస్తే వృద్ధి రేటు ఒక శాతం తగ్గిందన్న మాట.

- ఏప్రిల్–జూన్ నెలల్లో గనుల తవ్వకం వల్ల వచ్చే ఉత్పాదన 2.8 శాతం క్షీణించింది. ఏడాది క్రితం ఇదే కాలంలో ఈ విభాగంలో 0.4 శాతం వృద్ధిరేటు నమోదైంది.
- తయారీ రంగంలో ఉత్పత్తి 1.2 శాతం తగ్గింది. నిర్మాణం, విద్యుదుత్పత్తి, హోటల్స్, రవాణా తదితర రంగాల్లో వృద్ధిరేటు తగ్గింది.
- సేవల రంగ వృద్ధి రేటు 8.9 శాతం ఉంది. ఒక సంవత్సర కాలం క్రితం ఇదే కాలంలో సేవల రంగంలో 9.3 శాతం మేర వృద్ధి ఉంది.
- వ్యవసాయోత్పత్తి 2.7 శాతం పెరిగింది. ■






# విధానాల్ని, రాజకీయాల్ని మార్చుకుంటేనే తెలుగువారి సంక్షోభానికి శాశ్వత పరిష్కారం

2009 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో మొదలైన ముసలం ముదిరి ఈవేళ భారీసంక్షోభంగా తయారవటం చూసి రాష్ట్ర విభజన, సమైక్యత వాదాలతో సంబంధం లేకుండా మారుమూల గ్రామాల నుంచి ప్రపంచవ్యాప్తంగా ఉన్న చాలామంది తెలుగువాళ్లు బాధపడుతున్నారు. ఏదో తెలంగాణ ప్రాంతంలో ఆందోళన జరుగుతోంది, హైదరాబాద్‌లో పెద్దగా లేదు, మన పనులకు ఆటంకం లేదు అని ఇన్నాళ్లూ సర్దిపుచ్చుకుని వస్తున్న కోస్తా, రాయలసీమ నివాసులకు కూడా ఇప్పుడు సెగ తాకింది. రాష్ట్ర విభజన జరిగిన తీరు వారిని భయాందోళనకు, ఆగ్రహావేశాలకు గురిచేశాయి. రాష్ట్రంలో నెలకొన్న సంక్షోభ పరిస్థితులను చూసి ఇతర రాష్ట్రాల వాళ్లు కూడా సానుభూతి చూపుతున్నారు. కేంద్రంలో యూపీయే ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి రావటంలో కీలకపాత్ర పోషించిన తెలుగువారు ఆ ప్రభుత్వం వల్లే ఈవేళ సంక్షోభ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఖచ్చితంగా చెప్పాలంటే, ఇది ఆంధ్రప్రదేశ్‌కి ఒక చారిత్రక సంధి దశ.

ఆరంభశూరత్వంతో హడావుడి చేసి, సంక్షోభంతో సర్దుకుపోయి పాతపంథాతో యథాతథంగా బతకటమా, లేకుంటే, ఎక్కడ తప్పు జరిగింది అని జాగ్రత్తగా ఆలోచించి భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా, రాజకీయ పటంలో ఎన్ని రాష్ట్రాలున్నా తెలుగువారి మధ్య ఐక్యత చెక్కుచెదరకుండా, విశ్వజనీన దృక్పథంతో, అభివృద్ధితో కొనసాగేలా చేసుకోవటానికి తగిన మార్పుల్ని చేసుకోవటమా మనం తేల్చుకోవాలి. 'సంక్షోభంలో కూరుకుపోయి రాజీపడటమా? సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకుని మార్పును సాధించుకోవటమా?' - యావత్ భారతదేశానికి దిశానిర్దేశం చేయగల గొప్ప అవకాశం ముంగిట ఈవేళ ఆంధ్రప్రదేశ్ ప్రజలున్నారు.

మార్పు కోసం ఈ సంక్షోభాన్ని ఓ అవకాశంగా వినియోగించుకోవాలనుకుంటున్న వాళ్లు ముందుగా సమస్య మూలాల్ని కాస్తయినా నిశితంగా పరిశీలించాలి. తెలంగాణ ప్రాంతంలో నిజాం పాలనపోయినా రాచరిక వ్యవస్థ లక్షణాలు ఇక్కడ ఇంకా బలంగా వేళ్లూనుకుని ఉన్నాయి. అలాగే రాయలసీమ, కోస్తాంధ్రలో వలసపాలన పోయినా ఫ్యూడల్ అవశేషాలు రాజ్యమేలుతున్నాయి. అయితే చట్టబద్ధ పాలన, ప్రజలకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు, జనం చేతికి అధికారం అందిస్తూ, అందరి ప్రయోజనాల్నీ సమన్వయం చేస్తూ అందరికీ సమానహక్కుల్ని, సమానావకాశాల్ని కల్పించే భారత రాజ్యాంగాన్ని అమలు చేయాల్సిన రాజకీయ వ్యవస్థే రాజ్యాంగాన్ని అపహాస్యం చేసే ధోరణుల్ని ప్రోత్సహించటం, తానే అపహాస్యం చేయటంవల్ల తెలంగాణ ప్రాంతంలో సుదీర్ఘకాలంగా ఉన్న అసంతృప్తులు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు రూపంలో రాజుకున్నాయి. ఓట్లకోసం తాయిలాలు, తాత్కాలిక పథకాలు, డబ్బు, మద్యం, ప్రలోభాల్ని పంచటంతోపాటు ప్రజల మధ్య చిచ్చుపెట్టటం కూడా సాంప్రదాయ రాజకీయం అనుసరించే ఎత్తుగడల్లో ఒకటి. ఇలాంటి చిచ్చుపెడుతూ రాజకీయ లబ్ధి కోసం రాచరిక, ఫ్యూడల్ శక్తులు తెలంగాణ, సమైక్యాంధ్రప్రదేశ్ ఉద్యమ రథసారథులుగా మారారు. ప్రపంచంలో ఏదేశంలో లేనంత భిన్నత్వం, సంక్లిష్టతలు ఉన్న భారతదేశంలో ఎంతో సులువుగా అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేసే అద్భుత రాజ్యాంగం మనకుంది, దాన్ని అమలు చేసే రాజకీయం విఫలమవటం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది, రాజకీయాల్ని, విధానాల్ని మార్చుకోవటం ద్వారానే తెలంగాణ సమస్యకు అసలైన పరిష్కారం వస్తుంది, రాజధాని మారినా రాజకీయవ్యవస్థ మారకుండా సమస్య పరిష్కారం కాదు అని చెప్పిన లోక్‌సత్తా మాటలకంటే, రాజ్యాంగాన్ని చిత్తుకాగితంలా చేసి తమ తక్షణ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను రెచ్చగొట్టి విద్వేషాల్ని పెంచిన వారిపట్లే ప్రజలు ఎక్కువగా స్పందించారు.

ఒక ఓటు, రెండు రాష్ట్రాలు పేరుతో కాకినాడలో తీర్మానం

చేసిన బీజేపీతో తెలుగుదేశం 1999లో ఎన్నికల పొత్తు పెట్టుకుంది. కానీ తెలుగుదేశం సమైక్యవాద పార్టీ అనే సాకు చూపి బీజేపీ తెలంగాణ అంశాన్ని వాయిదా వేసింది(రాజధాని ఉన్న తెలంగాణ ప్రాంతం విడిపోతాననటంలో అర్థం లేదని ఆ తర్వాత కేంద్ర హోంమంత్రి హోదాలో బీజేపీ అగ్రనేత ఎల్.కె అద్వానీ లిఖితపూర్వకంగా కూడా పేర్కొన్నారు). అయితే ఎటుచూసినా బలంగా కనబడుతున్న తెలుగుదేశం ప్రభుత్వాన్ని కూల్చడానికి నిజాయతీతో ప్రయత్నించే సంకల్పబలం, ప్రత్యామ్నాయ రాజకీయం లేక అప్పటి ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ నేత వైఎస్ రాజశేఖర రెడ్డి 2000 సంవత్సరంలో మళ్లీ తెలంగాణ అంశాన్ని లేవనెత్తారు. సుమారు 40మంది తెలంగాణ ప్రాంత శాసనసభ్యుల చేత ప్రత్యేక తెలంగాణ డిమాండ్‌తో తమ పార్టీ జాతీయ అధ్యక్షురాలు సోనియాగాంధీకి విజ్ఞాపనపత్రం ఇప్పించారు. అప్పట్నుంచి ప్రస్తుత రూపంలో తెలంగాణ ఉద్యమం మళ్లీ మొదలైంది. 2004లో కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్ వ్యవహారాల ఇంఛార్జి గులాంనబీ ఆజాద్ ఒత్తిడితో టీఆర్ఎస్‌తో వైఎస్ పొత్తుకు అంగీకరించటంతో ఉద్యమం బలం పుంజుకుంది. టీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోకపోయినా వైఎస్ ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు ఫీలర్స్‌ని ఇస్తూనే 2004లో ప్రచారం చేసే వ్యూహాన్ని సిద్ధం చేసుకున్నారు. కాబట్టి ప్రస్తుత తెలంగాణ ఉద్యమాన్ని బలోపేతం చేసింది ప్రధానంగా వైఎస్ రాజశేఖర రెడ్డి అనటంలో ఏమాత్రం సందేహించనక్కర్లేదు.

ఎన్నో ఏళ్లుగా సాగుతున్న దుష్పరిపాలన, అధికారం కోసం రాచరిక, ఫ్యూడల్ శక్తుల మధ్య యుద్ధం ప్రత్యేక తెలంగాణ ఉద్యమరూపంలో వ్యక్తమైంది తప్ప శతాబ్దాల కిందటి ప్రత్యేక డిమాండ్ ఉద్యమాలకు కొనసాగింపుగా ఈవేళ్టి తెలంగాణ ఉద్యమాన్ని చూడాల్సిన అవసరమైతే లేదు. కానీ నేతలు, ప్రజాసంఘాల ప్రచారహోరు వల్ల, అభివృద్ధి గణాంకాల ప్రకటనలో ప్రభుత్వం అలసత్వం వహించి ఆయా శక్తులకు పరోక్షంగా సహకరించటం వల్ల పాత ఉద్యమాలకు, ఒడంబడికలకు కొనసాగింపుగానే ఈవేళ్టి ఉద్యమం వచ్చిందనే భావన బలంగా ప్రజలలోకి వెళ్లిపోయింది. హైదరాబాద్ నగరాన్ని కట్టించిన కులీకుతుబ్‌షా అసలు ఈ దేశమూలవాసీయే కాదు. చెరువులోకి ఎలాగైతే చేపలు చేరుకుంటాయో అదేతీరుగా అన్ని వైపుల నుంచీ ప్రజలు వచ్చి ఇక్కడ స్థిరపడి ఈ ప్రాంతాన్ని సుసంపన్నం చేయుగాక అని కులీకుతుబ్‌షా ఆనాడు అన్నాడని చెబుతుంటారు. ఆయన ఆకాంక్ష ఫలించి హైదరాబాద్ భారతదేశంలోనే టాప్‌టెన్ ప్రధాన నగరాలలో ఒకటిగా కొనసాగుతోంది. సరైన రాజకీయ వ్యవస్థ ఉండి ఉంటే, అంతర్జాతీయ నగరాలతో పోటీపడి ఉండేది. ముస్లింల దండయాత్రల వల్ల మనదేశానికి సాంస్కృతికంగా, సామాజికంగా జరిగిన నష్టం అపారం. అయినా ఈవేళ మనదేశంలోని ముస్లింలను ఎవరూ కూడా పరాయిభావనతో చూడటాన్ని రాజ్యాంగం అనుమతించదు. వర్తమానానికి, భవిష్యత్తుకు పనికిరాని చరిత్ర అంశాలను మనం వదిలేయాలి. గాంధీ భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చాడన్న కారణంతో ఐన్‌స్టీన్, మార్టిన్ లూథర్‌కింగ్, నెల్సన్ మండేలా, బరాక్ ఒబామా వంటి వారు, ప్రపంచవ్యాప్తంగా అనేకమంది ప్రజలు గౌరవించరు. దేశస్వాతంత్ర్యం పేరుతో ఆయన మనిషి సంపూర్ణ జీవనానికి కావలసిన మానసిక, భౌతిక మార్పులకు వ్యవస్థీకృత ఏర్పాట్ల కోసం పోరాడాడు కాబట్టే గాంధీని మహాత్ముడిగా విదేశీయులు సైతం గౌరవిస్తారు. అందుకే స్వాతంత్ర్యం, చరిత్ర వంటి బలమైన ఉద్వేగపూరిత అంశాలకు సైతం ఆచరణలో పరిమితి ఉందని గుర్తించే పరిస్థితిని పాదుకొల్పి ఉంటే, తెలంగాణప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌ను చారిత్రక నేపథ్యాల చుట్టూ తిప్పే, ప్రజలలో ఆటవిక భావోద్వేగాలను రెచ్చగొట్టే మితిమీరిన ప్రచారానికి ఆస్కారం ఉండేదికాదు.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని రాజకీయ అవసరాల కోసం వైఎస్ రాజశేఖర రెడ్డి పెంచి పోషించి 2004 ఎన్నికల్లో టీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకున్నారు. ఆ తరువాత అధికారంలోకి రావటం కోసం తెలంగాణ ఏర్పాటుకు అనుకూల వైఖరిని తీసుకుని 2009 ఎన్నికలలో టీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకుని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఆ ఉద్యమం ఉధృతమయ్యేలా చేశారు. తెలంగాణ ప్రాంతంలో ఎన్నికలు పూర్తయిన వెంటనే సీమ, కోస్తాలో ప్రచారం చేసిన రాజశేఖర రెడ్డి ఎంత విషప్రచారం చేశారంటే, టీఆర్ఎస్‌తో పొత్తు ఉన్న టీడీపీ గెలిస్తే హైదరాబాద్ వెళ్లాలంటే వీసా కావాల్సుంటుందని ప్రజల్ని రెచ్చగొట్టారు. ఎన్నికలలో కాంగ్రెస్ గెలిచినా, 2009 సెప్టెంబర్‌లో వైఎస్ దుర్మరణం చెందటంతో ఆయన కుమారుడు వైఎస్ జగన్మోహన రెడ్డి అధికారం కోసం చకచకా పావులు కదపటం, సొంతంగా తమకు ప్రజలను ప్రభావితం చేసే శక్తి లేకపోవటంతో, జగన్‌ను అడ్డుకునేందుకు

టీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఆమరణ దీక్ష సాకుతో కాంగ్రెస్ అధిష్టానం సోనియాగాంధీ పుట్టినరోజైన డిసెంబర్ 9న ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించటం జరిగింది. దీంతో దిగ్భ్రాంతి చెందిన కోస్తా, సీమలోని నేతలు రాజీనామాల పర్వంతో కేంద్ర నిర్ణయాన్ని నిలువరించారు. కులతత్వం లేకపోవటం, పదవులను త్యాగం చేయగల ధీశక్తి వంటి కొన్ని గొప్ప లక్షణాలు ఉన్నప్పటికీ ఆబ్జెక్టివిటీతో కాకుండా ప్రతి అంశాన్నీ వ్యక్తిగతంగా తీసుకోవటం సోనియాగాంధీకున్న బలహీనత అని తెలిసినవారెవరైనా ఆమె తన పుట్టినరోజున ఇచ్చిన కానుకహామీని నెరవేర్చేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తారని ఇట్టే అర్థమవుతుంది. ఆ సమయంలో రెండు ప్రాంతాల మధ్యా చిచ్చును అరికట్టి సంధి సమయాన్ని కాస్త వ్యవస్థలో మంచి మార్పు దిశగా వినియోగించేందుకు లోక్‌సత్తా పార్టీ ఒక ప్రతిపాదన చేసింది. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు నిర్ణయానికి కట్టుబడి ఉంటూనే, తెలంగాణ ప్రాంతంలో జిల్లా ప్రభుత్వాలను ఏర్పాటు చేసి, రెండేళ్ల తర్వాత అందరూ కూర్చుని నూతన వ్యవస్థ ఏర్పాటును కొనసాగిస్తూ కొత్త రాష్ట్ర ప్రతిపాదనపై సామరస్యంగా ఏకాభిప్రాయానికి రావాలని చెప్పింది. అయితే ఆ వేడిలో ఎవరూ లోక్‌సత్తాను నెగ్గనివ్వలేదు. తర్వాత పరిస్థితుల అధ్యయనానికి శ్రీకృష్ణ కమిటీ వేశారు. కమిటీలోని వ్యక్తులపై ఎన్ని ఆరోపణలు వచ్చినా జస్టిస్ శ్రీకృష్ణ వ్యక్తిత్వం, సామర్థ్యం ఎవరూ వేలెత్తిచూపలేనివి. నిష్పాక్షికంగా రాష్ట్ర పరిస్థితి గురించి అన్ని కోణాలలో ఆ కమిటీ వివరించింది. వెనకబాటుతనం వల్ల వేరు పడతామని తెలంగాణ ఉద్యమవాదులలో చాలామంది చేసిన వాదన తప్పని, అసలు వెనకబడింది రాయలసీమని కమిటీ నిగ్గుతేల్చింది. విడిపోవటం కన్నా కలిసుండటం రాష్ట్ర ప్రజలకు మేలని స్థూలంగా తేల్చింది, ఒకవేళ విడిపోవటం తప్పనిసరి అనుకుంటే, ఎలా చేయాలో కొన్ని సూచనలు చేసింది. ఆ కమిటీ నివేదికపై చర్చించిన దాఖలాలు కూడా లేకుండా, మళ్లీ కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ జులై 30, 2013న తెలంగాణకు అనుకూలంగా నిర్ణయాన్ని ప్రకటించి అమలుకు చర్యలు ప్రారంభించింది. తెలంగాణపై జరిపిన అఖిలపక్ష సమావేశంలో తెలుగుదేశం, వైకాపా సహా అన్ని ప్రధాన పార్టీలూ అంగీకరించాయి కాబట్టి తాము ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు నిర్ణయం తీసుకున్నామని కాంగ్రెస్ వర్గాలు సమర్థించుకుంటున్నాయి. మరోవైపు, కోస్తా, సీమలో ఆందోళనల తీవ్రతను చూసి తెలుగుదేశం, వైకాపాలు దొంగాట ప్రారంభించి అక్కడ ఆందోళనల్ని ఎగదోసే కార్యక్రమాన్ని చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ తెలుగు ప్రజల మధ్య చిచ్చు పెట్టిందని, అడ్డగోలుగా విభజించిందని, హైదరాబాద్‌లాంటి మహానగరాన్ని రాజధానిగా సీమాంధ్రలో నిర్మించటానికి రూ. 5 లక్షల కోట్లు కావాలని చంద్రబాబు నాయుడు అత్యంత బాధ్యతారహితంగా మాట్లాడారు. హైదరాబాద్‌లాంటి మహానగరాల్ని కట్టడాల్లాగా చూడటం చాలా అవగాహనారాహిత్యం. అభివృద్ధినంతా హైదరాబాద్‌లో కేంద్రీకరించబట్టే ఈవేళ రాష్ట్రానికి ఈ పరిస్థితి వచ్చిందని గుర్తించకుండా నిస్సిగ్గుగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేసింది తానేనని చెప్పుకోవటానికి చంద్రబాబు చెప్పుకుంటున్నారు. ప్రజల విజ్ఞత పట్ల ఆయనకు అంత చిన్నచూపు. వైకాపా అయితే ఒక ప్రైవేటు దుకాణంలా నడుస్తూ దాదాపు సమైక్యాంధ్రప్రదేశ్ డిమాండ్‌తో నిరాహారదీక్షలు వంటి పద్ధతుల్లో ఆందోళనలు చేస్తోంది.

ఇక రాష్ట్రంలో సంక్షోభాన్ని పెంచటంలో మీడియా పాత్ర కూడా తక్కువేమీ కాదు. సంపాదకుల స్థాయిలోని వారు కూడా నిష్పాక్షికతను కోల్పోయి రాష్ట్ర విభజనేదో పెద్ద విప్లవాత్మక కార్యక్రమమన్నట్టు రాశారు. రాష్ట్రం విడిపోతే కొంపలంటుకుపోతాయన్నట్టు వార్తల్ని ప్రచారం చేశారు. సామాజిక అవగాహన ఉన్న విద్యావేత్తలు కూడా ఈ ఉచ్చులో చిక్కుకుపోయారు. కేవలం కొద్దిమంది సీనియర్ జర్నలిస్టులు మాత్రం కాలం గడుస్తున్నకొద్దీ వాస్తవాలను గుర్తించి వెనకబాటుతనం, వివక్ష వంటి సమస్యల్ని ఎదుర్కొంటున్న ప్రాంతాలు రాష్ట్రంలో ఇంకా ఉన్నాయని, అయితే తెలంగాణ ఒక్కటే ప్రత్యేక రాష్ట్ర మార్గాన్ని ఎంచుకుందని పేర్కొన్నారు. ఎంత చిన్నతనం నాటి కలయినా, ఎన్నేళ్లపాటు నమ్మిన అంశమయినా, అది వాస్తవంకాదు అని తెలితే పంథాను మార్చుకోగల సానుకూల దృక్పథాన్ని, వ్యక్తిత్వాన్ని ప్రదర్శించిన జర్నలిస్టులు, మేధావులు సంఖ్య చాలా తక్కువగా ఉండటం దురదృష్టకరమే.

స్థూలంగా ఈ అంశాలన్నీటి మీదా అన్ని ప్రాంతాలలోని తెలుగు ప్రజలకు స్పష్టత, దాన్నుంచి భవిష్యత్తులోనైనా ఇటువంటి సంక్షోభాలు తలెత్తకుండా సరైన కార్యాచరణ, దాన్ని అమలుచేసుకోగల సంకల్పం కావాలి.

తెలంగాణ ఏర్పాటు నిర్ణయంపై కాంగ్రెస్ తప్పుచేస్తే తెలుగుదేశం, వైకాపా కూడా తప్పుచేసినట్టే. ఏ ప్రాతిపదికన తెలంగాణకు అనుకూలంగా ఆ పార్టీలు నిర్ణయం తీసుకున్నాయి? హైదరాబాద్ లేకుంటే కోస్తా, సీమకు భారీ నష్టం వస్తుందనే భయాందోళనల్ని పట్టించుకున్న పార్టీలైతే, ఆ సందేహాన్ని మొదట్నుంచీ ఎందుకు లేవనెత్తలేదు? అలాంటి రాజధాని ఏర్పాటు కోసం ఆ ప్రాంతంలో ఎందుకు ప్రయత్నాలు చేయలేదు? రెండు ప్రాంతాలలో ఆందోళనల్ని ఎందుకు కొనసాగనిస్తున్నారు? తెలంగాణపై ఆ పార్టీలు నిర్ణయం తీసుకోవటానికి ఎన్నికల లబ్ధి దృష్టే తప్ప ఒక హేతుబద్ధత, ప్రజాప్రయోజనం లేదు. అలాగే మళ్లీ నిర్ణయం మార్చుకోవటానికీ ఒక హేతుబద్ధత, ప్రజాప్రయోజనం లేదు. అందుకే తలాతోకాలేని ఆందోళనలు చేపట్టి ప్రజలు ఎలాగూ తమ పార్టీల మధ్యే ఓట్లు వేయాలి కాబట్టి ఒకరిమీద ఒకరు బురద జల్లుకుంటుంటే, కాసిని ఎక్కువ ఓట్లు వచ్చయినా తాము గెలుస్తామనే ఆశతో ఆ పార్టీలు కోస్తా, సీమలో ఉద్యమాలలో పాల్గంటూ ప్రజలను మభ్యపెడుతున్నాయి. సామాజిక తెలంగాణ నినాదమిచ్చి సమైక్యాంధ్రప్రదేశ్ నినాదానికి మళ్లిన చిరంజీవి, కోస్తా, సీమల నుంచి కేంద్రమంత్రులైన మరికొందరు ఈ హైడ్రామాలో తమతమ క్యారెక్టర్లను దిగ్విజయంగా పోషిస్తున్నారు.

రాష్ట్రంలోని పార్టీలు ఎలా వ్యవహరించినా, ఆ అంశంపై లోతైన పరిశీలన చేసి, అందరినీ కూర్చోబెట్టి స్థూలంగా ఆమోదయోగ్య నిర్ణయాన్ని ప్రకటించాల్సిన కేంద్రప్రభుత్వం ఆ బాధ్యతలో ఘోరంగా విఫలమైంది. ఎటువంటి కసరత్తు చేయకుండానే 2009లో తెలంగాణకు అనుకూలంగా కేంద్రం నిర్ణయం ప్రకటించింది. ఆ తర్వాత కూడా పార్టీల అభిప్రాయాలు తీసుకుంది కానీ, అందరి అభిప్రాయాలనూ, అభ్యంతరాలనూ లోతుగా తెలుసుకుని సమన్వయం చేసే బాధ్యతను మాత్రం విస్మరించి మళ్లీ కోస్తా, సీమల్లో ఆందోళనల్ని రెచ్చగొట్టి, తెలుగువాళ్ల మధ్య అగాధాన్ని పెంచి ఓట్ల లబ్ధి పెంచుకునేరీతిలో తెలంగాణకు అనుకూల నిర్ణయాన్ని ప్రకటించింది. రాష్ట్రంలోని సమస్యను రాష్ట్ర అసెంబ్లీలోనే చర్చించి పరిష్కరించుకుందాం, తెలంగాణపై సమగ్రంగా చర్చించి సామరస్యంగా ఒక నిర్ణయం తీసుకుని కేంద్రానికి పంపుదాం అని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే డా॥ జయప్రకాష్ నారాయణ్ పలుమార్లు అసెంబ్లీలో కోరినా ఏ పార్టీ స్పందించలేదు. రాష్ట్ర కాంగ్రెస్, తెలుగుదేశం, వైకాపా తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఢిల్లీ వీధుల్లో తాకట్టుపెట్టాయి. కేంద్రప్రభుత్వం తెలుగువారిని ఫుట్‌బాల్ ఆడుకునేలా చేశాయి. రాష్ట్రంలోని ప్రధాన పార్టీల తీరువల్లే ఈవేళ తెలుగు ప్రజలకు ఈ దుస్థితి తీవ్రతరమై పరిష్కారం జటిలంగా మారింది. ఆర్థికవ్యవస్థ దెబ్బతిని అందరూ ఆందోళన చెందే పరిస్థితి వచ్చింది. ఇక ప్రత్యామ్నాయ రాజకీయానికి ఎంతో కొంత కృషి చేసే కమ్యూనిస్టు పార్టీలు కూడా తెలంగాణ అంశంలో దివాళాకోరు రాజకీయ విధానంతోనే వ్యవహరించాయి. ప్రత్యేక రాష్ట్రం కావాల్సిందే అని సీపీఐ అనటం, సమైక్యాంధ్రప్రదేశ్ ఉండాల్సిందే అని సీపీఎం అనటం ఏమాత్రం ప్రత్యామ్నాయ రాజకీయం కాదు. ఒక్క లోక్‌సత్తా పార్టీ తప్ప రాష్ట్రంలోని అన్ని పార్టీలూ తెలంగాణ అంశంపై పాతరాజకీయ ధోరణితోనే, ముందుచూపులేని ధోరణితోనే వ్యవహరించాయి.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంపై లోక్‌సత్తా పార్టీ స్థూలంగా ఏం చెప్పిందో ఒక్కసారి పరిశీలించండి...

"తెలంగాణ కావచ్చు, సమైక్యాంధ్రప్రదేశ్ కావచ్చు, అవి మార్గాలే తప్ప లక్ష్యాలు కావు.

తెలంగాణ, సమైక్యాంధ్రప్రదేశ్ కోడ్ పదాలు మాత్రమే. స్వయంపాలన, ఉపాధి అవకాశాలు, లాభసాటి వ్యవసాయం వంటి అంశాలు తెలంగాణ ఉద్యమం వెనక ఉన్నాయి. అలాగే హైదరాబాద్ వంటి మహానగరం లేకపోవటం, నీటివనరులు, ఉపాధి అవకాశాలు, లాభసాటి వ్యవసాయం వంటి భయాలు సమైక్యాంధ్రప్రదేశ్ ఉద్యమం వెనక ఉన్నాయి. వీటిని పరిష్కరించకుండా కొత్త రాష్ట్రం ఏర్పాటు చేయటం వల్ల ఒరిగేదేమీ ఉండదు. రాజకీయ వ్యవస్థ మారకుండా రాజధాని మారినంత మాత్రాన ప్రయోజనం ఉండదు.

రాష్ట్రం ఏర్పాటు ఉపద్రవం కాదు, సర్వరోగ నివారిణి కూడా కాదు.

లోక్‌సత్తా పార్టీ చిన్న రాష్ట్రాలకు, తెలంగాణ ఏర్పాటుకు వ్యతిరేకం కాదు.

ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షను తెలంగాణ ప్రాంత ప్రజలు పలుమార్లు ఎన్నికల ద్వారా వ్యక్తం చేశారు. సమగ్ర చర్చ, సామరస్య పరిష్కారంలో భాగంగా వచ్చే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుని లోక్‌సత్తా స్వాగతిస్తుంది"

అని లోక్‌సత్తా పార్టీ పలుమార్లు తన వైఖరిని ప్రకటించింది. సమగ్ర, సామరస్య పరిష్కారంలో భాగంగా వచ్చే తెలంగాణ అంటే ఏమిటి అని లోక్‌సత్తా వైఖరిని ఎగతాళి చేసిన వాళ్లకు ఇప్పుడు వాస్తవం అర్థమవుతోంది. ఏమాత్రం చర్చ చేయకుండా, అవతలి ప్రాంతంవారిని ఒప్పించకుండా రాష్ట్ర విభజన చేస్తామనేవాళ్లు, అలాంటి ఉద్యమాలను చేసేవాళ్లు ఎంత మోసకారులో ప్రజలకు ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది.

అదేసమయంలో ప్రజలు తాము ఈ విషయంలో చేసిన తప్పును కూడా ఇక్కడ గుర్తించాలి. ఆ మాటకొస్తే ఇతరత్రా అంశాలలో ఇది ఎంతోకాలంగా చేస్తూ వస్తున్న తప్పు కూడా. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వల్ల నష్టపోతామని అంత భయాందోళనలకు గురవుతున్నప్పుడు ఎందుకు టీఆర్ఎస్‌తో పొత్తుపెట్టుకుని, తెలంగాణ అనుకూల వైఖరిని తీసుకున్న కాంగ్రెస్, తెదేపా, వైకాపాలకు ఓట్లు వేసి గెలిపించారు? అంటే ఆ పార్టీలు ఎలాగూ తెలంగాణ ఇవ్వకుండా అడ్డుకుంటాయి, మనకు తాత్కాలిక ప్రయోజనాలు నెరవేరిస్తే చాలు మన ప్రాంతం, మన కులం, మన మతం అని ఓట్లు వేసేద్దాం అనుకుని గెలిపించారు. సరైన విధానాలు, సరైన రాజకీయం ఉన్న లోక్‌సత్తాలాంటి పార్టీలను బలహీన పార్టీలంటూ పక్కనపడేసి, బలం పేరుతో తప్పుడు విధానాలు, నల్లడబ్బు రాజకీయం చేసే పార్టీలను గెలిపిస్తే చివరికి ఎవరు నష్టపోయారు? ప్రజలుగా మనమే కదా! ప్రజలు ఓట్లు వేస్తేనే ఏ పార్టీ అయినా బలమైన పార్టీగా అయ్యేది. కానీ మన అభివృద్ధి కోసం, మన భవిష్యత్తు ప్రయోజనాల కోసం సరైన పార్టీఏది అని ఆలోచించకుండా, పార్టీలకు, నాయకులకు బానిసలుగా మారి వారి కోసం, వారి కుటుంబాల కోసం ఓట్లు వేస్తే ఇంతకంటే ఏం జరుగుతుంది? చాలాకాలంగా ఈ పనిచేస్తూండటం వల్లే ఇంత దుస్థితి వచ్చింది. రాజకీయ, ఆర్థిక, సాంకేతిక అభివృద్ధినంతా ఒకే ప్రాంతంలో కేంద్రీకరిస్తే అసమానతలు పెరిగి ప్రమాదకర పరిణామాలు వస్తాయి, విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలు, లాభసాటి వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసి తాత్కాలిక పథకాలు, అనుచితమైన ఉచితాలు ఇస్తూ అసంబద్ధ పథకాలు చేపడుతూ పోతే సమాజం అల్లకల్లోలమవుతుందని చెప్పిన లోక్‌సత్తాకు మద్దతిచ్చి ఉంటే ఈ పరిస్థితి వచ్చేదా? అసెంబ్లీలో లోక్‌సత్తాకు 20-30 సీట్లు వచ్చి ఉంటే తెలంగాణ అంశం 2009లోనే పరిష్కారమైపోయి ఉండేదిగదా? ఇంత సంక్షోభం తర్వాతైనా మనలో మార్పు రావాలి. ప్రత్యామ్నాయ రాజకీయ విధానాలున్న, వీలున్నంతమేర ఆచరణలో చూపుతున్న లోక్‌సత్తా వంటి పార్టీకి ఓట్లు వేయటమే ఈ సంక్షోభం మనకు చెప్పే గొప్ప పాఠం. మంచిని, మనస్సాక్షిని వాయిదా వేస్తున్నంతకాలం మనల్ని ఈ సంక్షోభాలు ఏదోకరూపంలో వెంటాడుతూనే ఉంటాయి.

రెండు ప్రధాన జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ తెలంగాణకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవటం, రాష్ట్రంలోని అన్ని ప్రధాన పార్టీలూ ఆమోదం తెలపటం వల్ల తెలంగాణ ఏర్పాటు దాదాపు అనివార్యం. రాష్ట్రం ఏర్పాటు ఉపద్రవమేమీ కాదు కాబట్టి, దీన్నో పాలనాపరమైన కార్యక్రమంగానే భావించి సహకరించటం కోస్తా, రాయలసీమ ప్రాంతంలోని ప్రజల, నేతల కర్తవ్యం. ఈ క్రమంలో తాము మోసపోయామన్న భావన ఉంటే భావప్రకటనా స్వేచ్ఛ ఉంది, ఓటు హక్కు ఉంది. అక్కడ మీ సత్తా చూపండి. అంతేతప్ప బంద్‌లు, రాస్తారోకోలు, దహనకాండలు, జాతీయనేతల విగ్రహాల విధ్వంసం వంటి చర్యలకు దిగవద్దు. ప్రజాసేవకుల్లా వ్యవహరించాల్సిన ప్రభుత్వోద్యోగులు సమ్మెకు దిగి సమైక్యాంధ్రప్రదేశ్ ఉద్యమం చేస్తామంటే దాన్ని ప్రజలు ఆమోదించకూడదు. వ్యవస్థలో రాజకీయ నేతల పాత్ర ఎంతో, ప్రభుత్వోద్యోగుల పాత్ర కూడా దాదాపు అంతే ఉంటుంది. రాజ్యాంగం ప్రకారం నేతల నిర్ణయాల్ని సరిచేసి అమలుచేసే బాధ్యతను ప్రభుత్వోద్యోగులు సక్రమంగా చేయకపోబట్టే అవినీతి, దుష్పరిపాలన కొనసాగుతూ ఈవేళ రాష్ట్రంలో ఉద్యమాలు చెలరేగుతున్నాయి. అన్ని ప్రాంతాల్లో ప్రజల పరిస్థితి దయనీయంగా మారింది. కాబట్టి ప్రభుత్వోద్యోగులు వారి సమస్యలు చెప్పటానికి, సక్రమంగా పనిచేయటానికి పరిమితమవ్వాలి తప్ప రాజకీయ ఉద్యమాలలో భాగస్వాములు కావటాన్ని ప్రోత్సహించకూడదు. అలాంటి ఆందోళనలు చేయటం వల్ల తెలంగాణ ప్రాంతం చాలా నష్టపోయింది. ఇప్పటినుంచైనా కోలుకోవాలి. తిరిగి అదే తప్పును కోస్తా, సీమలలో చేయవద్దు. ఖచ్చితంగా తెలుగు ప్రజలు ప్రలోభాలకు, భావోద్వేగాలకు లోనై వ్యవహరిస్తుండటం, ఓట్లు వేస్తుండటం, తమ సమస్యలను తామే పరిష్కరించుకుని కేంద్రం నుంచి ఎక్కువ నిధుల్ని రాబట్టుకోగలిగే ఐకమత్యాన్ని ప్రదర్శించలేకపోతుండటాన్ని అడ్డం పెట్టుకుని ఢిల్లీ పెద్దలు రాష్ట్రంతో చెలగాటమాడుతున్నారనటంలో సందేహం లేదు. అందుకే ఎన్ని ఆందోళనలున్నా పార్లమెంటరీ లేదా కేబినెట్

కమిటీ కాకుండా కాంగ్రెస్ తరుపున ఆంటోనీ కమిటీ వేసింది. ఒత్తిడి మరీ ఉక్కిరిబిక్కిరి చేస్తుండటం వల్లో, మరో వ్యూహంతోనో ప్రభుత్వ కమిటీ కూడా వేస్తామని సోనియాగాంధీ మీడియాకు చెప్పారు. అది కూడా పదేపదే అడిగాక. కొత్త కమిటీ విధివిధానాలేమిటో కూడా (ఈ వ్యాసం రాసే సమయానికి) బైటికి రాలేదు. ఓట్ల వేటలో జరుగుతున్న ఈ వికృత రాజకీయాన్ని గుర్తించి, మన మధ్య తప్పిదాల్ని సరిచేసుకుని తెలుగువారంతా ఐక్యంగా వ్యవహరించాలి తప్ప మన వేళ్లతో మన కళ్లే పొడుచుకునేలా వ్యవహరించకూడదు.

హైదరాబాద్‌లో తెలుగువారందరి ప్రయోజనాలనూ పరిరక్షించే నిర్దిష్ట ఏర్పాట్లు, ఆదాయపంపిణీ, నీటివనరుల పంపిణీ, ఉద్యోగులు సమస్య, అత్యంత వెనకబడిన రాయలసీమకు ప్రత్యేక ఏర్పాట్లు తదితర కీలకాంశాలను పరిష్కరించుకుని ఎన్ని రాష్ట్రాలైనా తెలుగువారంతా ఒక్కటే అని ప్రపంచానికంతటికీ చాటాలి, తలెత్తుకుని బతకాలి. ఎవరితోనైనా కలిసి జీవించి ఎదగగలగటం భారతదేశాభివృద్ధికి ఈవేళ కీలకం. ఆర్థిక హద్దులు అసలే ఉండకూడదు. రాష్ట్రం ఏర్పాటుకు సంబంధించిన తతంగం ముగిశాక, వ్యవస్థలో మార్పు తెచ్చే ఎజెండా– అధికార వికేంద్రీకరణ, అవినీతి అంతానికి ఏర్పాట్లు, చట్టబద్ధ పాలన, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలు, ఉత్పత్తిరంగంతో ఉపాధి అవకాశాలు, వ్యవసాయాన్ని– పరిశ్రమలను అనుసంధానం చేయటం, చిన్న పట్టణాల అభివృద్ధి తదితర విధానాలను అమలుచేయకపోతే ఇంత పోరాటమూ వృధాయే అవుతుంది. మరోమారు ప్రజలు దగాపడటమే అవుతుంది. అందుకే ప్రజలు ఆలోచించి ఓటువేయటం, వ్యవస్థలో మార్పు తెచ్చే సరైన విధానాలకు ఓటు వేయటం ఇకనైనా ప్రారంభిస్తే, ఈ సంక్షోభం మనకో అవకాశంగా మారి మిగిలిన భారతదేశానికి కూడా దిశానిర్దేశం చేయగలుగుతాం. ■

**– 21వ శతాబ్దపు భారతీయుడు**

# అణ్వస్త్ర రహిత ప్రపంచంపై బీజింగ్ అంతర్జాతీయ సదస్సుకు లోక్‌సత్తా నేతకు ఆహ్వానం



ఆగస్టు 23, 24 తేదీలలో చైనా రాజధాని బీజింగ్‌లో జరగనున్న 'అణ్వస్త్రరహిత, అహింసాయుత ప్రపంచం కోసం కార్యాచరణ – శాంతి ఉద్యమం ముందున్న కర్తవ్యాలు' అంశంపై అంతర్జాతీయ సెమినార్‌లో పాల్గనేందుకు లోక్‌సత్తా పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సభ్యుడు మెట్ల జగన్మోహన్‌కి ఆహ్వానం లభించింది. ఈ సదస్సుకి చైనీస్ పీపుల్స్ అసోసియేషన్ ఫర్ పీస్ అండ్ డిజార్మమెంట్ (సి.పి.ఎ.పి.డి) వివిధ రాజకీయ పార్టీల నుంచి ఎంపిక చేసిన ఆహ్వానితుల జాబితాలో లోక్‌సత్తా నేతకు అవకాశం కల్పించారు.

19న చైనాకు బయల్దేరి 20 నుంచి 22 వరకు షాంఘైలో పర్యావరణ సమస్యలు, ప్రకృతి విపత్తులపై జరిగే చర్చలలో పాల్గన్న అనంతరం 23, 24న బీజింగ్‌లో అణ్వస్త్రాలకు వ్యతిరేకంగా జరుగుతున్న సమావేశంలో జగన్మోహన్ పాల్గంటారని, ఆయా అంశాలపై ప్రత్యామ్నాయ రాజకీయ జాతీయ పార్టీగా లోక్‌సత్తాకున్న విధానాలను సమావేశాలలో తెలియచేస్తారని పార్టీ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. ■

# మహిళలకు అంతటా అన్యాయం

- **కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో 10 శాతమే మహిళలు**
- **వారికి సౌకర్యాలూ అంతంతే.. స్థాయి సంఘం నివేదిక**

'కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులను లైంగిక వేధింపులకు గురిచేసే వారిని కేవలం బదిలీ చేసి ఊరుకుంటున్నారు. గట్టి చర్యలు తీసుకోవడం లేదు. దీనిపై పార్లమెంట్ చట్టం చేసినప్పటికీ, రాష్ట్రాలు చొరవ చూపడం లేదు. 15 ఏళ్ల క్రితం సుప్రీంకోర్టు మార్గదర్శకాలనే ఇప్పటికీ అమలు చేస్తున్నారు' అని మహిళా ఉద్యోగుల విషయంలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై పార్లమెంటరీ స్థాయీ సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. పార్లమెంటుకు సమర్పించిన ఈ నివేదికలో స్థాయీ సంఘం మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు విషయాలను వెలుగులోకి తెచ్చింది. 'పార్లమెంట్‌లో మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తామని మాట్లాడతారు. ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే మహిళలకు న్యాయం చేయరు' అంటూ ఘాటుగా వ్యాఖ్యానించింది.

**నివేదికలో ప్రధానాంశాలు... :**

- పురుష ఉద్యోగులకు, మహిళా ఉద్యోగులకు వేర్వేరు పని పరిస్థితులు కల్పించాల్సిన అవసరం ఉంది. మహిళలకు పని గంటల్లో మార్పులు, ఇంటివద్ద పనిచేసే అవకాశం కల్పించే విషయం పరిశీలించాలి. ప్రధానంగా చంటి పిల్లల తల్లుల విషయంలో ఈ మేరకు జాగ్రత్త తీసుకుంటే నిపుణులైన ఉద్యోగులను నిలబెట్టుకోవచ్చు.
- ప్రసూతి సెలవుల విషయంలో రకరకాల చట్టాలను కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్లో అనుసరిస్తున్నారు. అందరికీ 180 రోజుల సెలవు ఇవ్వాలి. అన్ని రంగాల్లో మహిళా ఉద్యోగులకు తప్పనిసరిగా శిశు సంరక్షణ సెలవును కేటాయించాలి. మహిళల ఉద్యోగోన్నతులకూ ప్రత్యేక మార్గదర్శక సూత్రాలు రూపొందించాలి.
- ఈ నివేదిక ప్రకారం మొత్తం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో 10.04 శాతమే మహిళా ఉద్యోగులున్నారు. రైల్వేలో 6.47 శాతంకాగా, రక్షణ శాఖలో 11.77 శాతమే. స్త్రీలు పెద్ద ఎత్తున ఉద్యోగాల్లో చేరేందుకు తగిన ప్రచారం చేయాలి.
- మహిళలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించకపోతే దాన్ని తీవ్రంగా పరిగణించాలి. మహిళా ఉద్యోగులను నియమించే సెలెక్షన్ కమిటీల్లోనూ పురుష అధికారులే ఉండడాన్ని తప్పుపట్టింది.
- మహిళా ఉద్యోగి ఎవరైనా రాజీనామా చేస్తే అందుకు కారణాలను విశ్లేషించాలి. ఉద్యోగం వదులుకోకుండా కౌన్సిలింగ్ ఇవ్వాలి. మహిళా ఉద్యోగులు తమ అనుభవాలను పంచుకునేందుకు, విశ్వాసాన్ని పెంచుకునేందుకు తగిన వేదికలను ఏర్పాటు చేయాలని కమిటీ సూచించింది.
- లైంగిక వేధింపులను తీవ్రంగా పరిగణించాలి. తప్పుడు ఆరోపణల పట్ల అప్రమత్తంగా ఉండాలి.
- వికలాంగులైన మహిళలకు శౌచాలయాలు, పార్కింగ్ సౌకర్యాలు కల్పించాలని, పిల్లలకోసం క్రెచ్, ప్లే స్కూల్, రవాణా వంటి సదుపాయాలను ఏర్పర్చాలి.
- ఎవరైనా మహిళ ఒంటరిగా ఉండాలనుకున్నా, లేక పెళ్లి చేసుకోకుండా పిల్లల్ని పెంచుకోవాలనుకున్నా వారికి తగిన మద్ధతునివ్వాలి. ఇందుకోసం ప్రత్యేక విధానాన్ని రూపొందించాలి. సాధ్యమైనంత మేరకు దంపతులు ఇద్దరూ ప్రభుత్వోద్యోగులైతే ఒకేచోట ఉండేలా చూడాలని పేర్కొంది.

చిత్రమేమంటే ఈ నివేదికను సమర్పించిన సిబ్బంది పింఛన్లు, ప్రజా సమస్యలు, న్యాయ మంత్రిత్వశాఖలకు చెందిన స్థాయీ సంఘంలో 31 మంది ఉండగా వీరిలో మహిళా ఎంపీలు ఇద్దరే. మరో విషయం.. కొద్దిరోజుల క్రితం లైంగిక కార్యకలాపాలకు పాల్పడుతూ పట్టుబడ్డ రాజ్యసభ సభ్యుడు అభిషేక్ సింఘ్వీ కూడా ఈ కమిటీలో సభ్యుడే. ■

# ప్రభుత్వ పాఠశాలలలోనే చదివించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ఎందుకు చదివించాలంటే :

- శిక్షణ పొందిన ఉపాధ్యాయులుంటారు.
- ఉపాధ్యాయులు విద్యా లక్ష్యాలకు అనుగుణంగా బోధిస్తారు / విద్యార్థులు నేర్చుకోవడానికి సహాయ పడతారు.
- ప్రజాస్వామ్య వాతావరణం ఉంటుంది.
- విద్యార్థుల మానసిక స్థితికి అనుకూలమైన బోధన / అభ్యాసనం ఉంటుంది.
- బోధన, అభ్యాసనా విధానాలు శాస్త్రీయంగా ఉంటాయి.
- సామాజిక, ఆర్థిక పరిస్థితులపై విద్యార్థులు స్వీయ అనుభవం పొందుతారు.
- విద్యార్థులు Life Skills పై అవగాహన పెంపొందించు కుంటారు.
- బోధన / అభ్యాసన ప్రక్రియలు విలువల ఆధారంగా సామాజిక నేపథ్యంలో ఉంటాయి.
- జీవన ప్రమాణాలు మెరుగుపరచుకోవడం కోసం విద్యను విద్యార్థులు ఉపయోగించుకుంటారు.
- రాజ్యాంగ లక్ష్యాలు, సామాజిక దృక్పథం, సాంఘిక విలువలు విద్యార్థులకు అలవడుతాయి.
- మూల్యాంకనం శాస్త్రీయ విధానంలో జరుగుతుంది.
- సమసమాజ నిర్మాణానికి కావలసిన భావనలు, పునాదులు ప్రభుత్వ విద్యాసంస్థలలోనే ఏర్పడతాయి.
- లాభార్జనే ధ్యేయంగా ఏర్పడిన ప్రయివేటు విద్యాసంస్థలు విద్యా లక్ష్యాలను చేరుకోలేవు. సమగ్రమూర్తిమత్వాన్ని పెంపొందించ లేవు.

ప్రభుత్వ పాఠశాలలు పటిష్టం చేయడానికి ప్రభుత్వం ఈ క్రింది చర్యలు చేపట్టాలి :

- మధ్యాహ్న భోజన పథకం పరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహింపబడాలి. విశాలమైన డైనింగ్ హాల్, వంటగది, స్టోర్ రూమ్, శిక్షణ పొందిన నిర్వహణ సిబ్బంది, పటిష్టమైన మానిటరింగ్ ఉండాలి.
- పాఠశాలలో ప్రయోగశాలలు, గ్రంథాలయాల కోసం ప్రత్యేక వసతులు గల గదులతో పాటు శిక్షణ పొందిన సిబ్బందిని ఏర్పాటు చేయాలి. ప్రయోగాల కోసం పరికరాలు, ప్రయోగాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు అందుబాటులో ఉండాలి. గ్రంథాలయాలలో విద్యార్థులు కూర్చొని చదువుకునేందుకు సౌకర్యాలతో పాటు, ప్రతి సంవత్సరం పత్రికలు, గ్రంథాలు కొనేందుకు నిధుల కేటాయింపుతోపాటు గ్రంథాలయ ఉద్యోగిని నియమించాలి.
- ప్రాథమిక స్థాయిలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు, సెకండరీ స్థాయిలో సబ్జెక్టులవారీగా ఉపాధ్యాయులను నియమించాలి.
- ఒక ఉపాధ్యాయుడు ఏ కారణం చేతనైనా దీర్ఘకాలిక సెలవులో వెళ్ళినట్లయితే, ఆ ఉపాధ్యాయుడు వచ్చే వరకూ వేరే ఉపాధ్యాయుని నియమించాలి.
- ప్రతి పాఠశాలలలో కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసి, ఉపాధ్యాయులను నియమించి, తరగతులు నిర్వహించాలి.
- పాఠశాలలకు మౌలిక సదుపాయలు అంటే త్రాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేసి, సిబ్బందిని నియమించి, సక్రమంగా నిర్వహించేలా చూడాలి.
- అత్యాధునిక తరగతి గదులను ఏర్పాటు చేయ్యాలి. అంటే విద్యార్థులు కూర్చునేందుకు బెంచీలు, పుస్తకాలు ఉంచుకునేందుకు డెస్క్‌లు, యల్.సి.డి. ప్రొజెక్టర్, స్క్రీన్, టి.వి., డి.వి.డి. సౌకర్యాలు గల తరగతి గదులు కనీసం పాఠశాలలకు ఒకటి చొప్పున ఉండాలి.
- ప్రభుత్వం సరఫరా చేసే యూనిఫాం నాసిరకంగా ఉంటోంది. మంచి యూనిఫాం సరఫరా చేయాలి.
- పాఠశాలలకు కాంపౌండ్ గోడలు, గేటుతో విధిగా ఉండాలి. కానీ, దురదృష్టం ఏమిటంటే పాఠశాల ఆవరణలు కొన్ని గ్రామాల్లో బహిర్భూమిగా వాడబడుతున్నాయి.

**ప్రజావేదికలో ఉపాధ్యాయ గళం**

- ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాలు మొక్కుబడిగా కాకుండా, ఆసక్తికరంగా, విషయ పరిజ్ఞానంతో కూడి ఆచరణయోగ్యంగా ఉండాలి.
- విద్యావ్యవస్థ పర్యవేక్షణ సక్రమంగా ఉండాలి. దురదృష్టం ఏమిటంటే మన రాష్ట్రంలో 900కి పైగా మండల విద్యాశాఖాధికారి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇన్ ఛార్జీలతో నడుస్తున్నాయి.
- ఉపాధ్యాయుల కామన్ సీనియారిటీ వంటి సమస్యలు పరిష్కరించి, చక్కని సర్వీరూల్స్‌ని అమలు పరచాలి.

(ఈ వ్యాస రచయిత తన కుమారుడిని 8వ తరగతి ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాల, శ్రీకాకుళంలో చదివిస్తున్నాడు) ■

**- చావలి శ్రీనివాస్,**
ప్రభుత్వ ఉపాధ్యాయులు, MPUP పాఠశాల,
కనుగులవాని పేట, శ్రీకాకుళం మం, & జిల్లా.

# కళాశాలల్లో సురాజ్య శంఖారావం




విద్యార్థి దశలోనే యువతను సమాజ శ్రేయస్సుకి చైతన్య పరచి, ఉత్తేజితుల్ని చేయటం ద్వారా నవసమాజ నిర్మాణం తద్వారా సురాజ్య స్థాపన జరగాలన్న ఆశయంతో "కళాశాలల్లో సురాజ్య శంఖారావం" కార్యక్రమాన్ని ఉద్యమం రెండవ ఘట్టంలో జూలైలో ప్రారంభించటం జరిగింది.

ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో కొన్ని ప్రముఖ విద్యాసంస్థలను ఎంచుకొని, తరచుగా విద్యార్థులకు చైతన్య పరిచే కార్యక్రమాలు, నైపుణ్యాలు పెంచే శిక్షణాలు మొదలుగునవి నిర్వహించ తలపెట్టింది. ఇందులో భాగంగా జూలై 24 నుండి ఆగస్టు 1 సమయంలో, నర్సాపురం (పశ్చిమ గోదావరి జిల్లా)లోని వై.యన్. కళాశాల, విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాల, దుర్గా మల్లేశ్వరి సిద్దార్థ మహిళా కళాశాల మరియు ఖమ్మం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలలో విద్యార్థులతో, ఉపాధ్యాయులతో సురాజ్య సమావేశాలు ఏర్పాటు చేశారు. ప్రసంగాలతో, షార్ట్ ఫిల్మ్స్ ద్వారా విద్యార్థులతో సురాజ్య లక్ష్యాలను చర్చించి, నవసమాజ స్థాపనకు నడుం బిగించాలని యువతను చైతన్యపరిచారు. కళాశాలల యాజమాన్యంతో సురాజ్య ఉద్యమం అనుబంధాన్ని ఏర్పరచుకుంది.

ఈ కార్యక్రమంలో దాదాపుగా 1000 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. హైదరాబాద్ నుండి సురాజ్య ఉద్యమం కో-ఆర్డినేటర్స్ మరియు కార్యకర్తలు డాక్టర్ మనోహరి వెలమాటి, పి.శివాజి, పి.గోపిచంద్, ఐ.నాగభూషణ్ మరియు ఇ. వంశీ వివిధ పట్టణాలలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ■

# అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలి

## ఆందోళనలతో నష్టం : జేపీ

**చెన్నై**

తెలంగాణ కోసం నాలుగేళ్లుగా ఉద్యమాలు జరిగాయి. ఆ ఆందోళనలతో రాష్ట్రం మొత్తం ఆర్థికాభివృద్ధి కుంటుపడింది. తెలంగాణ ప్రకటన అనంతరం ఇప్పుడు సమైక్యాంధ్ర కోసం ఆందోళనలు జరుగుతున్నాయి. ఇలాగే కొనసాగితే నష్టం ఇరుప్రాంతాల వారికీ ఉంటుందని లోక్‌సత్తా అధినేత డాక్టర్ జయప్రకాష్ నారాయణ అన్నారు. ఆందోళనలతో రాష్ట్రం మరింత వెనకబడుతుందని, వీటిని వెంటనే ఆపాలని ఆయన ఉద్యమకారులను ఉద్దేశించి పేర్కొన్నారు. రాష్ట్రం విడిపోవటమా, కలిసుండటమా అన్న విషయాన్ని పక్కనబెట్టి ఇరు ప్రాంతాలు అభివృద్ధి చెందేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆలోచించాల్సిన సమయమన్నారు. తెలంగాణ, సీమాంధ్ర రెండు ప్రాంతాల అభివృద్ధికి తాను ఓ ప్రణాళికను రూపొందిస్తున్నానని, దీనికోసం రాత్రింబవళ్లు కష్టపడుతున్నానని చెప్పారు. సేవా సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని ఆస్కాలో 'భాషా సామరస్యం- భారత ప్రజాస్వామ్యం' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో జయప్రకాష్ నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని కీలక ఉపన్యాసం చేశారు. తమిళనాడులో అమలవుతున్న ద్విభాషా సూత్రం వలన తెలుగు మాతృభాష కలిగిన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని జేపీ పేర్కొన్నారు.

ప్రాథమిక విద్య ఇంట్లో మాట్లాడే భాషలో సాగితేనే విద్యార్థి ఇతర భాషలను సైతం అవలీలగా నేర్చుకుంటాడని, విద్యలో పరిపూర్ణత సాధిస్తాడన్న విషయం అనేక అంతర్జాతీయ సర్వేల ద్వారా శాస్త్రీయంగా నిరూపణ అయిందన్నారు. ఈ విషయాన్ని తాను కూడా బలంగా నమ్ముతానని అందుకే తన కుమారుడికి ప్రాథమిక విద్య తెలుగు మాధ్యమంలో అందిస్తున్నానని పేర్కొన్నారు. తమిళనాడులో 40 శాతం ఉన్న తమిళేతరులు మాతృభాషల్లో చదువుకునేలా అవకాశం కల్పించాలని జేపీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జై సమైక్యాంధ్ర అని చెప్పాలంటూ ప్రసంగానికి ముందు కొందరు సమైక్యవాదులు జేపీని కోరగా తనను ఆ వివాదంలోకి లాగొద్దన్నారు.

# ప్రజా సమస్యలపై పాలకులు స్పందించాలి

## లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే జయప్రకాష్ నారాయణ్

**బన్సీలాల్‌పేట**

రాష్ట్రంలో ప్రజా సమస్యలు పేరుకుపోయాయని ప్రజా సమస్యలపై పాలకులు స్పందించాలంటూ లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు కూకట్‌పల్లి ఎమ్మెల్యే జయప్రకాష్ నారాయణ్ అన్నారు. బన్సీలాల్‌పేట డివిజన్‌లోని సీసీనగర్‌లో సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి హైమాప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యలపై బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా జయప్రకాష్ నారాయణ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో అవినీతి అంతమేలుతుందని అవినీతిని పారదోలాలంటే ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే రాజకీయం అంటే ఒక కుటుంబానికి ఒక వ్యక్తికి సంబంధించిన ఆస్తిని సంపాదించడం కాదని, రాజకీయం అంటే ప్రజల అవసరాలను గుర్తించి వాటిని పరిష్కరించడమే రాజకీయ నాయకుల లక్షణమని ఆయన అన్నారు. జరుగుతున్న ఎన్నికల్లో ఎక్కువగా రౌడీలు, గుండాలు రాజ్యమేలుతున్నారని రానున్న ఎన్నికల్లో అలాంటి వారిని గద్దెను ఎక్కకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని ఆయన అన్నారు. నగరంలో భూకబ్జాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని వీటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నగర అధ్యక్షుడు దోసపాటి రాము, రాష్ట్ర నాయకులు విజయేందర్ రెడ్డి, కార్యదర్శి రాజీవ్, భవాని, సతీష్ పాల్గొన్నారు.

# లోక్‌సత్తా వినూత్న నిరసన

## విజయనగరం

ప్రస్తుతం రాష్ట్రంలో విభజన పేరుతో జరుగుతున్న అంతర్యుద్ధానికి కారకులు ప్రజలా? పాలకులా? అన్న విషయాన్ని ప్రజలంతా గమనించాలని కోరుతూ, రాష్ట్ర విభజన తీరుకు నిరసగా లోక్‌సత్తా పార్టీ వినూత్న కార్యక్రమానికి తెర లేపింది. ఆ పార్టీ కార్యాలయం వద్ద పార్టీ రాష్ట్ర కార్యదర్శి భీశెట్టి బాబ్జీ 'రాష్ట్ర విభజన ప్రత్యేక శకటాన్ని' జెండా ఊపి ప్రారంభించారు. ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు రాష్ట్ర విభజనపై తమ విధానమేమిటో తెలపకుండా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులకు కేంద్ర ప్రభుత్వమే కారణమని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కె.దయానంద్ శర్మ, ఉపాధ్యక్షులు రాయి పద్మావతి, యువసత్తా జిల్లా అధ్యక్షులు పి.వి.రమణ పాల్గొన్నారు.



**జెండా వందనం చేస్తున్న లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి భీశెట్టి**

యువత నీచమైన రాజకీయాల వైపు వెళ్లకుండా ఉండాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి భీశెట్టి బాబ్జీ అన్నారు. స్థానిక కణపాకలో చైతన్య యువజన సేవాసంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని జెండావందనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆంగ్ల అధ్యాపకుడు కేఎస్ ప్రకాష్‌రావు, వాసు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న లోక్‌సత్తా నాయకులు**

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న రాష్ట్ర విభజన నిర్ణయం వల్ల తెలంగాణ, సీమాంధ్ర ప్రాంతాల ప్రజల మధ్య తీవ్ర విద్వేషాలు పెరుగుతున్నాయని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి భీశెట్టి బాబ్జీ అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం కాంప్లెక్స్ వరకు ర్యాలీ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అపోహలు కలిగిస్తూ వారిని ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నగర లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు నాయుడు వేణుగోపాల్, నగర కార్యదర్శి బి. జోయ్, ఎం.ఎస్.ఎన్.మూర్తి, సాంబశివరావు, చిప్పాడ ఉదయ్, రామ్మోహన్, రవి, కిశోర్ పాల్గొన్నారు.

# మంచి రాజకీయాలకు మంచి మనుషులు కావాలి : లోక్‌సత్తా పార్టీ

రాష్ట్రంలో చెలరేగుతున్న మంటలకు కారణం దుర్మార్గపు రాజకీయమే కారణమని విజయనగరం జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డి లక్ష్మినాయుడు తెలియచేశారు. డబ్బు, సారా, అవకాశావాద రాజకీయాలు జరుగుతున్నంత కాలం ఎన్ని రాష్ట్రాలుగా ఏర్పడిన ప్రయోజనం శూన్యమని చెప్పారు. రాష్ట్రంలో ప్రాంతీయ అసమానతలకు కారణం కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాలే నన్నారు. లోక్‌సత్తా చెప్పినట్టుగా జిల్లా ప్రభుత్వాలు ఏర్పాటు చేసి ప్రాంతీయ అసమానతలు రూపుమాసిపోతాయన్నారు. తరువాత పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేసి పార్టీలో క్రియాశీల సభ్యత్వం తీసుకున్న వారికి కేంద్ర కార్యాలయం నుండి వచ్చిన గుర్తింపు కార్డులను కార్యకర్తలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కార్యదర్శి జి.సత్యనారాయణ, ఉపాధ్యక్షులు వై. రమణ, రెడ్డి అప్పల నాయుడు, రేగిడిదాలి నాయుడు, ఎలకల శ్రీహరి, వి. బాలజీ, జె.రమణ, చిన్న యం.మోహన్, యం.రమణమూర్తి, సూర్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మనవాడైతే ఎవరైనా పర్వాలేదా? - లోక్‌సత్తా

మన బిడ్డల్ని ట్యూషన్‌కి పంపాలనుకున్నప్పుడు మంచి మాష్టారుని మాత్రమే ఎన్నుకుంటాముగానీ ఆ మాష్టారు మన కులం వాడా? మన వర్గం వాడా లేక మన మతం వాడా? అని ఆలోచించం. కానీ, ఓటు వేసేటప్పుడు మాత్రం ఎంత వెధవైనా సరే మన కులం వాడేనా? మన వర్గం వాడేనా? అని ఎందుకు ఆలోచిస్తున్నారు. అని ఒక ప్రశ్నకు సమాధానంగా లోక్‌సత్తా పార్టీ నగర అధ్యక్షులు బి. అశోక్ కుమార్ ఎద్దేవా చేశారు. మధురానగర్‌లోని 45వ డివిజన్‌లో కార్యదర్శి ఉప్పులూరి రవితేజ ఏర్పాటు చేసిన ప్రజలతో ముఖాముఖి కార్యక్రమములో యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని లోక్‌సత్తా పార్టీలో సభ్యులుగా చేరారు. ఈ కార్యక్రమములో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకునే అస్తవ్యస్థ నిర్ణయాలపై ప్రజలు అడిగిన ప్రశ్నలకు అధ్యక్షులు బి. అశోక్ కుమార్, పట్టాబి సీతారామయ్య, రవితేజ సమాధానాలు ఇవ్వడం జరిగింది. డివిజన్ సమస్యలపై పోరాడతామని హామీ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో నాయకులు బి. మురళీకృష్ణ, శివయ్య, గౌరీశంకర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



**విజయవాడ**

# యువత భవిష్యత్తు కోల్పోతుంది : జేపీ

ఓట్ల రాజకీయం దుర్మార్గ పాలనతో యువత భవిష్యత్తు కోల్పోతోందని, యువత మేలుకోవాలని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ్ అన్నారు. బాన్సువాడలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 80 ఏళ్ల క్రితం మనదేశంతో సమానంగా ఉన్నా చైనా ప్రస్తుతం ఉత్పత్తులను పెంచి దేశంలో ఎగుమతి రంగంలో అగ్రగామిగా ఉందన్నారు. చైనా గత 20 ఏళ్లలో 20 కోట్ల ఉద్యోగాలు ఇస్తే మనం 20 లక్షలు ఇవ్వలేని స్థితిలో ఉన్నామన్నారు. ఇందుకు పార్టీల ఓట్ల రాజకీయమే ప్రధాన కారణమన్నారు. అవినీతి స్వార్ధపు నిర్ణయాలతో ఎంతోమంది ఉద్యోగాలు కోల్పోతున్నారని ఆయన వాపోయారు. ఉద్యమాలతో ఎంతో నష్టపోతున్నామని ఆయన వాపోయారు. రెండు ప్రాంతాలకు కేంద్రం సమన్యాయం చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. ఉద్యోగులు ధర్నాలు, రాస్తారోకోల పేరుతో ఉద్యమాలు చేయరాదన్నారు. తాంబులాలు ఇచ్చి తన్నుకచావండి అనేలా కేంద్రం వ్యవహరించడం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు రాంరెడ్డి, నాయకులు రాంమోహన్, దేవేందర్ రెడ్డి, గీతామూర్తి, శేఖర్, లత తదితరులు పాల్గొన్నారు.



**బాన్సువాడ**

# సామరస్య పూర్వక పరిష్కారం చూపించాలి

## కాకినాడలో రౌండ్‌టేబుల్

తెలంగాణ, సమైక్యాంధ్ర వంటి అంశాల పరిష్కారానికి సామరస్య పూర్వకమైన మార్గాలు చూపించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డులో ఉన్న పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవితవ్యంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కటారి మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు ఆమోదయోగ్యమైన పరిష్కార మార్గాన్ని చూపించకపోతే రాష్ట్రంలో సంక్షోభం ఇలాగే కొనసాగుతుందన్నారు. రాష్ట్ర విభజన అనివార్యమైనట్టయితే రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి వచ్చే ఆదాయం, సాగునీరు, విద్యుత్ తదితర కీలక అంశాలపై సమగ్రమైన నిర్ణయాన్ని కేంద్రం ప్రకటించాలన్నారు. హైదరాబాద్ ఆదాయాన్ని హేతుబద్ధంగా పంపిణీ చేసే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం ముందుగా ప్రకటించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైడీ రామారావు అన్నారు. సీమాంధ్రలో ఆందోళన చెలరేగుతుంటే వారి అభ్యంతరాలను వినేందుకు రాజ్యాంగ బద్ధమైన కమిటీ ఏర్పాటు చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిమారుత్ అన్నారు. గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి, లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు పీవీవీఎస్ రామకృష్ణారావు, పార్టీ కాకినాడ నగర పాలక సంస్థ అధ్యక్షుడు కిషోర్‌కుమార్, విద్యావేత్త పి. చిరంజీవి ని కుమారి, ప్రముఖ న్యాయవాది జవహర్ ఆలీ మల్లాడి రాజు, రవిశంకర్ పాల్గొన్నారు.

# అధికార వికేంద్రీకరణతోనే తెలంగాణ అభివృద్ధి



## నిజామాబాద్

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతోనే సరిపోదని, యువతకు ఉపాధి అవకాశాలు, అధికార వికేంద్రీకరణ ద్వారానే అభివృద్ధి సాధ్యమని లోక్‌సత్తా జాతీయ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఆర్అండ్‌బీ అతిథిగృహంలో విలేఖరులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల చిరకాల కల నెరవేరే సమయం ఆసన్నమైందన్నారు. అవినీతి రహిత సమాజ నిర్మాణానికి యువత చైతన్యవంతం కావాలని పిలుపునిచ్చారు. పారిశ్రామికీకరణ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు సాధ్యమని సూచించారు. దిగుమతులు పెరిగి దేశ ఆర్థిక వ్యవస్థ రోజురోజుకు హీనదశకు చేరుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. తలసరి ఆదాయం 20 వేల ఖర్చులో 20 శాతం డబ్బులు గ్రామ స్థాయి వరకు చేరడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అద్భుతం కాదని, అలాగే ఉపద్రవం కాదన్నారు. సీమాంధ్రులు ఉద్యమాలు చేయడం మానుకోవాలని మరుసటి రోజే సూచించామన్నారు. యువత అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమించాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గోతులు తవ్వడం, గుంతలు పూడ్చడంతో ఉపాధి అసాధ్యమని ఎద్దేవా చేశారు. వ్యవసాయ రంగం దిగాలు పడిపోతోందని, ఉపాధి ఉత్పత్తి లేకుంటే ఒకతరం అంధకారంలో కూరుకు పోతుందన్నారు. జల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న తరుణంలో కోతలు ఇబ్బందికరమని ఆందోళన వ్యక్తం చేశారు. దిగుమతి సుంకాన్ని ప్రభుత్వం రైతులకిస్తే బ్రహ్మాండమైన ఉత్పత్తిని సాధిస్తారన్నారు. దోపిడి రాజకీయాలకు చరమగీతం పాడి మెరుగైన తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో పార్టీ నాయకులు బండారు రామ్మోహన్, మర్రి రాంరెడ్డి, గీతామూర్తి, రమేష్‌బాబు, దొడ్డి శేఖర్, లత, విజయేందర్‌రెడ్డి, మహేష్, నరహరి, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖపట్నం



# రాష్ట్రం కాంగ్రెస్ సొంత ఎస్టేటా?

ఆంధ్రప్రదేశ్ తమ సొంత ఎస్టేట్ అన్నట్టుగా కాంగ్రెస్ పార్టీ, కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నాయని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న సంక్షోభంపై లోకసత్తా ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాలను పణంగా పెట్టి కుటుంబ వ్యవహారంలా రాష్ట్రాన్ని విభజించారన్నారు. విభజన తీరు సరిగా లేదని ఆరోపించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించాలని కోరారు. హైదరాబాద్ నగరం, త్రాగునీరు, విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధి, విద్యుత్, రాయలసీమ తదితర సమస్యలపై విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. రవిమారుత్, కార్యదర్శి బీశెట్టి బాబ్జి, నగర అధ్యక్షుడు నాయుడు వేణుగోపాల్, ఆచార్య బాల మోహనదాస్, సి.ఎస్.రావు, ఐ.ఎం.అహ్మద్, బి.వి.రామ్, శివశంకర్, పలువురు మేధావులు పాల్గొన్నారు.

## హెచ్‌పిసియల్ బాధితులను పరామర్శించిన లోకసత్తా రాష్ట్ర అధ్యక్షులు



ఈ నెల 23న జరిగిన హెచ్‌పిసియల్ పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితులను లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కటారి శ్రీనివాసరావు సెవెన్‌హిల్స్ హాస్పిటల్‌లో పరామర్శించి జరిగిన ఘటన వివరాలు బాధితుల ద్వారా తెలుసుకున్నారు. పేలుడు జరిగిన తీరుపై కార్మికుల్లోని, ప్రజల్లోని అనేక అనుమానాలున్నాయని దీనిపై పూర్తిస్థాయి విచారణ ఇవ్వవలసిన అవసరం కంపెనీ యాజమాన్యానికి ఉందని ఆయన అన్నారు. ఆయనతో పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి భీశెట్టి బాబ్జీ, పార్టీ నాయకులు యల్లపు ప్రతాప్, శిరిపురపు శ్రీనివాస్ ఉన్నారు.

# లోక్‌సత్తాలోకి పలువురు మహిళలు




లోక్‌సత్తా ద్వారానే సమస్యల పరిష్కారం సాధ్యమవుతాయని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు సాంబిరెడ్డి అన్నారు. నియోజకవర్గం మహిళాసత్తా అధ్యక్షురాలు సుధాశేఖర్ సమక్షంలో వెంగళరావునగర్ డివిజన్‌కు చెందిన పలువురు మహిళలు లోక్‌సత్తా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి సభ్యత్వాన్ని అందించారు. నాయకులు చెన్నమ్మ, లక్ష్మి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# పాలకులకు పారదర్శకత అవసరం



రహ్మత్‌నగర్

ప్రజలకు పాలనను అందించే పాలకులు పారదర్శకతగా వ్యవహరించకపోవడం సమంజసం కాదని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డివివియన్.వర్మ అన్నారు. నిమ్సుమే సమీపంలో ఏర్పాటు చేసిన పౌర సమాచార కేంద్రం పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జూబ్లీహిల్స్ నియోజకవర్గ పార్టీ బాధ్యుడు సాంబిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ రాజకీయ పార్టీలను సమాచార హక్కు చట్టం పరిధిలోకి తీసుకురావాలనే విషయంలో పాలక, ప్రతిపక్ష పార్టీలు ముందుకు రాకపోవడం శోచనీయమన్నారు. లోక్‌సత్తా పార్టీ పారదర్శకంగా ఉండేందుకు ప్రజా సమాచార అధికారిని నియమించుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, రాజు, శివశంకర్, కిరణ్, సుధాశేఖర్, శ్రీవాణి, రమ, హైమ, లావణ్య, రాజీవ్, రాజు పాల్గొన్నారు



# కొత్త తరం రాజకీయాల్లోకి రావాలి

దేశ రాజకీయాల్లో కుటుంబపాలన వ్యవస్థ కాకుండా కొత్త తరం రాజకీయాల్లోకి వచ్చి మార్పు తీసుకురావాలని లోక్‌సత్తా జాతీయ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో లోక్‌సత్తా నిర్వహించిన బైక్‌ర్యాలీలో భాగంగా ఆయన ఎల్లారెడ్డికి వచ్చారు. పట్టణ ప్రధాన రహదారిలో ఆయన బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన రోడ్‌షో కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ కొలిక్కి రావడం ఆనందంగా ఉన్నా రాజకీయ వ్యవస్థలో మార్పు లేనంత వరకు ఎన్ని కొత్త రాష్ట్రాలు ఏర్పడిన ఫలితం శూన్యమని అన్నారు. కుటుంబపాలన కారణంగా దేశం అభివృద్ధి లేక అణగారి పోతున్నదని అన్నారు.

## ఎల్లారెడ్డి

ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా జిల్లా కన్వీనర్ మర్రి రాంరెడ్డి, రాష్ట్ర స్థాయి నాయకులు, స్థానిక నాయకులు నర్సింలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**'పంట నష్టపరిహారం ఇవ్వాలి'**

**లింగంపేట :** ప్రభుత్వం వెంటనే రైతులకు పంట నష్టపరిహారం ఇచ్చి, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఆయన కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డి వరకు నిర్వహించిన బైక్‌ర్యాలీ సందర్భంగా కొద్దిసమయం లింగంపేటలో రైతులతో కలిసి మాట్లాడారు.

**తాడ్వాయి :** మండలంలోని కృష్ణాజివాడి, తాడ్వాయి, ఎర్రాపహాడ్ మీదుగా లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రామ్మోహన్‌రావు, జిల్లా ఇన్‌చార్జి ఈద యాదన్న, లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు మర్రి రాంరెడ్డి, నాయకులు నరహరి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

## యువత రాజకీయాల్లోకి రావాలి

యువత రాజకీయాల్లోకి రావాలని జేపీ అన్నారు. పట్టణంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అంతకుముందు బైక్‌ర్యాలీ నిర్వహించారు.

# అవినీతిరహిత సమాజాన్ని నిర్మిద్దాం

## చింతకుంట



సమాజంలో అవినీతిరహిత సమాజాన్ని నిర్మించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. చింతకుంట గ్రామంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లంచం ఇవ్వకుండా ఏ ఒక్కరైన పట్టా పాసుపుస్తకాలు తెచ్చుకున్నారా? అని ప్రశ్నించగా, లేదని రైతులు సమాధానం ఇవ్వడంతో లంచాలు, అసమర్థపాలన వల్ల రైతులు గిట్టుబాటు ధర కోసం, యువత ఉపాధి కోసం ఉద్యమించాలని, ఇందుకోసమే లోక్‌సత్తా పోరాటాన్ని చేస్తోందని అన్నారు. ఎగుమతులను ప్రోత్సహిస్తే మూడేళ్లలో దేశం స్వయం సమృద్ధి సాధిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అలాగే మండలంలోని చింతకుంట వృద్ధాశ్రమం ఆవరణలో మొక్కలు నాటారు.

# దళారీ బజారుగా ఖమ్మం రైతుబజార్

ఏడాదికాలంగా ఖమ్మం బస్టాండ్ సమీపంలో గల రైతుబజార్ దళారి బజార్‌గా అక్రమ వ్యాపార అడ్డాగా మారిందని లోక్‌సత్తా జిల్లా ఉపాధ్యక్షుడు కొర్లకంటి బాలస్వామి అన్నారు. రైతుబజార్ అవినీతిపై ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో రైతుబజార్‌లో ఉన్న 70 షాపులలో 50 షాపులు బినామీలు అక్రమంగా నిర్వహించారని ఆయా పరిస్థితులను 2011-12 లోక్‌సత్తా ఆధ్వర్యంలో నిఘావేసి సంబంధిత అధికారులకు తెలియచేయడం జరిగిందని తెలిపారు. ఈ ఏడా రైతుబజార్‌లో దళారులు అడ్డుఅదుపులేకుండా సామాన్యులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఎక్కడ ధరలు లేని విధంగా వారి ఇష్టం వచ్చినట్టు ధరలు నిర్ణయించి విక్రయాలు జరుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# ముంబయిలోమహిళా జర్నలిస్టుపై అఘాయిత్యం

- నిందితులను వెంటనే శిక్షించండి...
- మహిళా సంఘాల డిమాండ్

## హైదరాబాద్

## మహిళాసత్తా నిరసన

మహిళా ఫొటో జర్నలిస్టుపై జరిగిన అఘాయిత్యాన్ని నిరసిస్తూ లోక్‌సత్తా పార్టీ మహిళా విభాగం మహిళా సత్తా ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్ స్వామి వివేకానంద విగ్రహం వద్ద నోటికి నల్లరిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళా సత్తా రాష్ట్ర కార్యదర్శి గీతామూర్తి మాట్లాడుతూ ఢిల్లీలో నిర్భయ ఘటన మరువక ముందే ముంబైలో మరో ఘటన చోటు చేసుకోవడం పట్ల ప్రభుత్వం మహిళల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటుందో అర్థమవుతోందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా మహిళల రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.




సనత్‌నగర్ నియోజకవర్గం, బన్సీలాల్‌పేటలో ప్రజా సమస్యలపై మాట్లాడుతున్న డా॥ జయప్రకాష్ నారాయణ్



కడ ధారధామ్ ఫ్లడ్ రిలీఫ్ ఫండ్ కార్యక్రమంలో డా॥ జయప్రకాష్ నారాయణ్



రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులపై నెల్లూరులో రౌండ్‌టేబుల్ సమావేశం



నరసాపురం లో నియోజకవర్గ సమావేశం

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2013-15 Published on 1st September, 2013








## విశాఖపట్టణంలో రౌండ్‌టేబుల్ సమావేశం

To,

**Book-Post**
PRINTED MATTER

If not delivered please return to:

**Lok Satta Times**
8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad